PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 219, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, మంగళవారం - 29 - సెప్టెంబర్ - 2026 , వెల రూ.5/-

## అక్టోబరు 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు.. పూర్తి షెడ్యూల్ ఇదే!



- అక్టోబరు 12 నుంచి 20 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- అధికమాసం కారణంగా ఈ ఏడాది రెండోసారి బ్రహ్మోత్సవాల నిర్వహణ
- అక్టోబరు 16న గరుడ వాహనం, 19న స్వర్ణరథం, 20న చక్రస్నానం
- ధ్వజారోహణం, ధ్వజావరోహణం లేకుండా జరగనున్న ఉత్సవాలు
- వాహన సేవల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసిన టీటీడీ

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్..

# 372 కుటుంబాలకు నెరవేరిన సొంతింటి కల

### మన ఇల్లు-మన లోకేశ్ కార్యక్రమంలో 372 మందికి పట్టాల పంపిణీ

- ★ 'కుంచనపల్లిలో లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన మంత్రి నారా లోకేశ్
- ★ నియోజకవర్గంలో 80 శాతం పట్టాల సమస్య పరిష్కారమైందన్న మంత్రి
- ★ రెండు విడతల్లో రూ.2 వేల కోట్ల విలువైన భూములకు శాశ్వత హక్కులు
- ★ ఎన్నికల హామీ మేరకు దీర్ఘకాలిక సమస్యకు లోకేశ్ పరిష్కారం



అమరావతి: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో హామీని నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్నారు. 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి మండలం కుంచనపల్లిలో 372 మంది లబ్ధిదారులకు ఆయన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. శ్రీ శ్రీనివాస కన్వెన్షన్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రభుత్వ భూముల్లో చాలాకాలంగా మిగతా 2 లో



## చిత్తూరులో సంచరిస్తున్న ఏనుగులను అడవిలోకి మళ్లించాలి

- చిత్తూరు జిల్లాలో మరోసారి ఏనుగుల సంచారం.. అధికారులను అప్రమత్తం చేసిన పవన్ కల్యాణ్
- ఆపరేషన్ కోసం ముసలమడుగు నుంచి కుంకీ ఏనుగులను తీసుకురావాలని సూచన
- పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని స్పష్టం
- మానవ-ఏనుగు ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం

## బహదూర్‌గూడ భూములు ప్రభుత్వానివైతే..

# పోలీసుల పహారా ఎందుకు?

### 420 హామీలు ఇచ్చి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

- రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు భూములు తీసుకుంటున్నారు
- ఇందిరమ్మ రాజ్యం అంటే.. పెద్దల భూములు ముట్టకుండా పేదల భూములు తీసుకోవడమా?
- ఈ పేదల తరపున పోరాడేందుకు బీఆర్ఎస్ ఉంది
- భూములు కొనడం.. అమ్మడమే.. రేవంత్‌రెడ్డికి తెలిసిన ఏకైక విద్య



హైదరాబాద్: బహదూర్‌గూడ భూములు ప్రభుత్వానివే అయితే.. పోలీసుల పహారా ఎందుకని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. 420 హామీలు ఇచ్చి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆయన విమర్శించారు. రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పి.. మిగతా 2 లో

## కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు



- ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు ముందస్తు చర్యలు
- నవంబర్ 1 నుంచి రెట్టింపు కానున్న పార్కింగ్ ఛార్జీలు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు
- నిర్మాణ, కూల్చివేత పనులపై పూర్తిగా నిషేధం
- ఫిబ్రవరి 28 వరకు అమలులో ఉండనున్న నిబంధనలు

ఢిల్లీ: ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు

# ఏపీలో కూల్ కూల్..

# తెలంగాణలో హాట్..హాట్

- తెలుగు రాష్ట్రాల్లో విభిన్న వాతావరణ పరిస్థితులు
- బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో.. ఏపీలో చల్లని వాతావరణం
- ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఎండలు వేసవిని తలపిస్తున్నాయి
- రాగల 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముంది



అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో.. ఏపీలో చల్లని వాతావరణం ఉండగా.. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఎండలు వేసవిని మిగతా 2 లో



## 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

- 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం
- మధురై రాజాజీ ఆసుపత్రిలో చిన్నారులకు స్వయంగా ఉంగరాలు తొడిగిన సీఎం

# 'మన్ కీ బాత్'లో ఉసిరిపై ప్రధాని ప్రశంసలు..

### ఆరోగ్యంతో పాటు ఆదాయానికి మార్గం!

- 'మన్ కీ బాత్'లో ఉసిరిని సూపర్‌ఫుడ్‌గా అభివర్ణించిన ప్రధాని మోదీ
- ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్‌లో ఉసిరి పరిశ్రమ విజయవంతమైందని వెల్లడి
- మహిళా స్వయం సహాయక బృందాల ఆదాయం పెరిగిందన్న ప్రధాని
- పోషకాహార లోపాన్ని తగ్గించడంలో ఉసిరి కీలకమని వ్యాఖ్య
- 'ఓకల్ ఫర్ లోకల్' నినాదానికి ఉసిరి సాగు ఊతమిస్తుందని పిలుపు



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' తాజా ఎపిసోడ్‌లో భారతీయ సంప్రదాయ ఫలం ఉసిరిపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉసిరికాయను ఒక 'సూపర్‌ఫుడ్'గా అభివర్ణించిన మిగతా 2 లో



## తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

- నాలుగేళ్ల నిరంతర విద్య నిబంధన తప్పనిసరి అని పునరుద్ఘాటన
- స్థానికతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- రాష్ట్రపతి ఉత్తర్వులను, తెలంగాణ జీవోను సమర్థించిన న్యాయస్థానం

## కాంగ్రెస్ కసరత్తు.. ఎమ్మెల్సీ స్థానాలు ఎవరికి?



- రెండు స్థానాల పదవీకాలం 2027 మార్చిలో ముగియనుంది
- గవర్నర్ కోటా మూడు స్థానాల పదవీకాలాలు నవంబర్‌లో ముగియనున్నాయి
- ఒక్కో స్థానానికి ముగ్గురు చొప్పున మొత్తం ఆరుగురు పేర్లతో పీసీసీ జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం
- అభ్యర్థుల ఎంపికలో ప్రధానంగా సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం

## ఆయుధాలు కొంటారా?.. జిన్‌పింగ్‌ను నేరుగా అడిగిన ట్రంప్!



- అమెరికా ఆయుధాలు కొంటారా? అని అడిగిన ట్రంప్
- ఈ విషయాన్ని వెల్లడించిన చైనాలో అమెరికా రాయబారి డేవిడ్ పెర్డ్యూ
- అమెరికా చట్టం ప్రకారం చైనాకు ఆయుధాలు అమ్మడంపై నిషేధం
- చైనాకు ఆయుధాలు అమ్మే ప్రణాళిక లేదన్న వైట్ హౌస్

## కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

# నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు

ఢిల్లీ: ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం ముందస్తు నియంత్రణ చర్యలకు ఉపక్రమించింది. కాలుష్య తీవ్రతను తగ్గించే లక్ష్యంతో 2026 నవంబర్ 1వ తేదీ నుంచి కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా పార్కింగ్ ఛార్జీలను రెట్టింపు చేయడంతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త నిబంధనల ప్రకారం, నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కేవలం 50 శాతం సిబ్బందితోనే కార్యకలాపాలు సాగించాలి. మిగిలిన 50 శాతం మంది ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు, నగర వ్యాప్తంగా భవన నిర్మాణ, కూల్చివేత పనులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. వాహనాల వినియోగాన్ని నియంత్రించేందుకు ఈ కాలంలో పార్కింగ్ ఫీజులను కూడా రెట్టింపు చేయనున్నట్లు వెల్లడించింది. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలలో పంట వ్యర్థాలను కాల్చడం, వాహన కాలుష్యం, నిర్మాణ రంగ ధూళి, దీపావళి బాణసంచా, పారిశ్రామిక ఉద్గారాల వంటి కారణాలతో ఢిల్లీ నగరం ప్రతి ఏటా గ్యాస్ ఛాంబర్‌ను తలపిస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ చర్యల ద్వారా శీతాకాలంలో కాలుష్య తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## ఏపీలో కూల్ కూల్.. తెలంగాణలో హాట్..హాట్



అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో.. ఏపీలో చల్లని వాతావరణం ఉండగా.. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఎండలు మే నెలను తలపిస్తున్నాయి. ఏపీలో పలుచోట్ల మేఘావృతమై ఉండగా.. నిజామాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లో భానుడు భగభగమంటున్నాడు. బంగాళాఖాతంలో మయన్మార్-అండమాన్ మధ్య వాయుగుండం ఏర్పడినట్లు వాతావరణశాఖ తెలిపింది. రాగల 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముంది. ప్రస్తుతం అండమాన్‌లోని మాయాబందర్‌కు 580 కి.మీ దూరంలో తూర్పు ఈశాన్యంగా కేంద్రీకృతమై ఉత్తర వాయువ్యంగా బంగ్లాదేశ్ వైపు పయనిస్తోంది. 72 గంటల్లో ఈశాన్య బంగాళాఖాతం-బంగ్లాదేశ్ మధ్య ఇది తీరం దాటే అవకాశముంది. వాయుగుండం ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముంది. గంటకు 30-40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇటీవలే బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ఏర్పడి కళింగపట్నం వద్ద తీరం దాటిన సంగతి తెలిసిందే. దాని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. మరోవైపు ఇటీవల వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోనూ పలు చోట్ల వర్షాలు కురవగా.. తాజాగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సాధారణం కన్నా మూడు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సాధారణం కన్నా నాలుగు డిగ్రీలు అధికంగా ఉన్నాయి. నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో 35 డిగ్రీలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 34 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 31.8 డిగ్రీలు సాధారణం కాగా.. ఆదివారం 34 డిగ్రీలు నమోదైంది. రానున్న రెండు రోజుల్లో మరో రెండు డిగ్రీలు పెరిగే అవకాశముందని.. ఎల్‌నినో (జుశ్రీ చీఅఅశీ) ప్రభావమే దీనికి కారణమని వాతావరణశాఖ తెలిపింది.

## తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత



హైదరాబాద్: తెలంగాణలో స్థానికత (లోకల్ స్టేటస్) అర్హత సాధించడానికి నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను పిటిషనర్ సవాల్ చేశారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోను సమర్థించింది. ఎంబీబీఎస్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు స్థానిక రిజర్వేషన్ పొందాలంటే, విద్యార్థి క్వాలిఫైయింగ్ పరీక్షకు ముందు కనీసం నాలుగేళ్ల పాటు తెలంగాణలోనే చదివి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, దానిని న్యాయస్థానం పునరుద్ఘాటించింది. ఈ తీర్పుతో తెలంగాణలో స్థానికతకు సంబంధించిన నిబంధనలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాసం అనే నిబంధన చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని, దీనిని కచ్చితంగా పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## 8 వేల ఎకరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

హైదరాబాద్: సిరిసిల్లలో భారాస నాయకులు 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని దోచుకున్నారని, అందులో 2,400 ఎకరాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన నిరాధార ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈనెల 30న సిరిసిల్లకు ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో.. ప్రజలు అడుగుతున్న పలు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని పేర్కొంటూ ఆదివారం కేటీఆర్ పలు ప్రశ్నలతో కూడిన బహిరంగలేఖ విడుదల చేశారు. “కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు పూర్తయిన తర్వాత తొలిసారిగా సిరిసిల్లకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్వాగతం. అయితే ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లకు వస్తున్నందున రాజకీయ విమర్శలు, వ్యక్తిగత దూషణలు కాకుండా ప్రజల సమస్యలకు సమాధానం చెప్పాలి. 2014 నుంచి 2023 డిసెంబరు వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేవలం 1,272 ఎకరాల భూమి మాత్రమే పంపిణీ జరిగింది. అందులో సిరిసిల్ల నియోజకవర్గంలో కేవలం 204 ఎకరాలు మాత్రమే పంపిణీ చేశాం. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా రైతుల అభ్యర్థనల మేరకు, అర్హత ప్రకారం రికార్డులు సవరించాం. మరి 8 వేల ఎకరాల భూమి ఎక్కడుంది? అందులో 2,400 ఎకరాలు ఏ భూమి? ఏ మండలం? ఏ గ్రామం? ఏ సర్వే నంబరు? ఎవరి పేరుపై ఉంది? అనే పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలి. ఆరోపణలు రుజువు చేయలేకపోతే.. సిరిసిల్ల ప్రజలకు ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలి. నేతన్నల రూ.60 కోట్ల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు? రైతుబంధు బకాయిలు ఎప్పుడిస్తారు? సిరిసిల్లకు అదనంగా ఎన్ని టన్నుల మార్కెట్ గోదాములను మంజూరు చేస్తారు? మల్కపేట నుంచి అప్పర్ మానేరు వరకు నీరు ఎప్పుడు ఇస్తారు? జిల్లాలో చెరువుల అభివృద్ధికి, చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ఎన్ని కోట్లు కేటాయిస్తారు? సిరిసిల్లలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ఎన్ని కోట్లు మంజూరు చేస్తారు? మొత్తంగా సిరిసిల్ల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి” అని కేటీఆర్ పేర్కొన్నారు.

## యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ..

# అక్టోబర్ 15 నుంచి అమలు

ఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే నిర్దిష్ట లావాదేవీలపై 0.4% ఛార్జీలు విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటిని నిలిపివేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నేడు విచారణ చేపట్టింది. ఈ నిర్ణయంతో షెడ్యూల్ ప్రకారమే కొత్త ఛార్జీల అమలుకు మార్గం సుగమమైంది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ముఖ్యంగా ఈ కొత్త ఛార్జీల విధింపునకు గల ప్రాతిపదికను వివరిస్తూ అఫిడవిట్ సమర్పించాలని కేంద్రాన్ని కోరింది.

### కొత్త నిబంధనల ప్రకారం ఛార్జీల స్వరూపం

సెప్టెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం, వ్యక్తుల నుంచి వ్యాపారులకు (పీ2పీ) చేసే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై 0.4% ‘మర్చంట్ డిస్కౌంట్ రేట్’ (ఎండీఆర్) వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 ఛార్జీ ఉంటుంది. అయితే, ఈ ఛార్జీల ప్రభావం సాధారణ వినియోగదారులపై ఎక్కువగా ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

### ఎవరికి మినహాయింపు?

వ్యక్తుల మధ్య (పీ2పీ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. వ్యాపారులకు చేసే రూ.2,000 లోపు చెల్లింపులు పూర్తిగా ఉచితం. యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు సున్నా-ఎండీఆర్ నిబంధన వర్తిస్తుంది. అత్యావసర సేవలకు ఫ్లాట్‌గా రూ.5, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02% చొప్పున తక్కువ ఛార్జీలు వర్తిస్తాయి.

### ఇది పన్ను కాదు, సెటిల్‌మెంట్ ఫీజు: కేంద్రం

కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ, ఈ కొత్త ఛార్జీల వల్ల దాదాపు 96% మర్చంట్ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే పన్ను కాదని, కేవలం పేమెంట్ సిస్టమ్‌లో భాగమైన ఒక సెటిల్‌మెంట్ ఫీజు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ ఛార్జీలు నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయరని ఆయన వివరించారు. ప్రస్తుతం స్టే ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ, కేంద్రం ఇచ్చే వివరణ అనంతరం సుప్రీంకోర్టు ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోనుంది.

## ‘తాయ్ మామన్’ పథకానికి శ్రీకారం..

# మేనమామలా మారిన సీఎం విజయ్

తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేడు మధురైలో ‘తాయ్ మామన్’ గోల్డ్ రింగ్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మధురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా సీఎం విజయ్ ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు. బిస్కెట్ కలర్ చొక్కా, పంచె ధరించిన సీఎం విజయ్, వేదికపై ముగ్గురు శిశువులకు స్వయంగా బంగారు ఉంగరాలు తొడిగి పథకాన్ని ప్రారంభించారు. తల్లులను ఆప్యాయంగా కుర్చీల్లో కూర్చోబెట్టి, పక్కనే ఉండి చిన్నారుల వేళ్లకు జాగ్రత్తగా ఉంగరాలు తొడిగారు. అనంతరం ఆయన వేదిక దిగి కింద కూర్చున్న మరో 12 మంది తల్లులు, వారి శిశువుల వద్దకు వెళ్లారు. అక్కడ చిన్నారులను చేతుల్లోకి తీసుకుని, వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు పెట్టాలని సీఎం విజయ్‌ను కోరారు. వారి అభ్యర్థనను మన్నించిన ఆయన, చిన్నారులను ఎత్తుకుని సంప్రదాయబద్ధంగా మూడుసార్లు పేరును ఉచ్ఛరించి నామకరణం చేశారు. ఈ భావోద్వేగపూరిత క్షణాల్లో అక్కడున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం తల్లులతో సెల్ఫీలు దిగి, కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఆ తర్వాత ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వార్డును సందర్శించి, అక్కడ మరో 10 మంది శిశువులకు బంగారు ఉంగరాలు అందించారు. వైద్యుల సమక్షంలో చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో సరదాగా గడిపారు. అంతకుముందు ఉదయం 11 గంటలకు చెన్నై నుంచి మధురై విమానాశ్రయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన కాన్వాయ్ ఆసుపత్రికి వెళ్లే దారి పొడవునా ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు నిలబడి పూలవర్షం కురిపించారు. రాజాజీ ఆసుపత్రి వద్ద వాహనం దిగి, జనసందోహం మధ్య నడుచుకుంటూనే వేదిక వద్దకు చేరుకున్నారు. దారిలో ఆసుపత్రి సిబ్బంది, ప్రజలకు అభివాదం చేస్తూ, పలుచోట్ల ఆగి వారితో ఫొటోలు దిగారు. సీఎం రాకతో ఆసుపత్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి.

## ఎల్ నినో ఎఫెక్ట్: తెలంగాణలో భగ్గుమంటున్న ఎండలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. ఎల్ నినో ప్రభావం కారణంగా పగటి ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల మేర ఎక్కువగా రికార్డవుతున్నాయి. ఫలితంగా రాష్ట్ర ప్రజలు అకాల వేడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో గరిష్ఠంగా 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇది సాధారణం కంటే 4 డిగ్రీలు అధికం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 34 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు కాగా, హైదరాబాద్‌లో సాధారణ ఉష్ణోగ్రత 31.8 డిగ్రీలకు బదులుగా ప్రస్తుతం 34 డిగ్రీలుగా నమోదవుతోంది. ఎల్ నినో ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## బంగాళాఖాతంలో మరో వాయుగుండం.. ఏపీకి వర్ష సూచన

అమరావతి: బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాయుగుండం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది. మయన్మార్, అండమాన్ దీవుల సమీపంలో ఏర్పడిన ఈ వాయుగుండం, ప్రస్తుతం అండమాన్‌లోని మాయాబందర్‌కు 580 కిలోమీటర్ల దూరంలో తూర్పు-ఈశాన్య దిశలో కేంద్రీకృతమై ఉంది. ఇది వాయవ్య దిశగా బంగ్లాదేశ్ వైపు కదులుతోంది. రానున్న 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా బలపడి, సుమారు 72 గంటల్లో బంగ్లాదేశ్ తీరాన్ని తాకవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ వాయుగుండం ప్రభావంతో ప్రభావిత ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవలే ఉత్తరాంధ్ర తీరంలో కళింగపట్నం వద్ద ఒక తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలతో పంట నష్టం జరిగిన నేపథ్యంలో తాజా హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్..

# 372 కుటుంబాలకు నెరవేరిన సొంతింటి కల

అమరావతి: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో హామీని నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్నారు. ‘మన ఇల్లు-మన లోకేశ్’ కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి మండలం కుంచనపల్లిలో 372 మంది లబ్ధిదారులకు ఆయన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. శ్రీ శ్రీనివాస కన్వెన్షన్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రభుత్వ భూముల్లో చాలాకాలంగా నివసిస్తున్న పేదలకు శాశ్వత హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దాదాపు 80 శాతం పట్టాల సమస్యను ఇప్పటికే పరిష్కరించామని తెలిపారు. మిగిలిన కేంద్ర ప్రభుత్వ భూముల సమస్యల పరిష్కారం కోసం సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం పేదల దశాబ్దాల కలను నెరవేరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు రెండు విడతలుగా పట్టాల పంపిణీ పూర్తి చేశారు. తొలి విడతలో 3,002 మందికి, రెండో విడతలో 2,634 మందికి పట్టాలు అందజేశారు. ఈ రెండు విడతల్లో కలిపి సుమారు రూ. 2 వేల కోట్ల విలువైన భూములకు ఉచితంగా శాశ్వత హక్కులు కల్పించారు. అటవీ, ఇరిగేషన్, రెవెన్యూ, దేవాదాయ, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని భూముల సమస్యలను పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మంత్రి లోకేశ్ ఈ కార్యక్రమాన్ని వేగంగా అమలు చేస్తున్నారు.

## ‘మన్ కీ బాత్’లో ఉసిరిపై ప్రధాని ప్రశంసలు..

# ఆరోగ్యంతో పాటు ఆదాయానికి మార్గం!

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం ‘మన్ కీ బాత్’ తాజా ఎపిసోడ్‌లో భారతీయ సంప్రదాయ ఫలం ఉసిరిపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉసిరికాయను ఒక ‘సూపర్‌ఫుడ్’గా అభివర్ణించిన ఆయన, ఇది రుచికి రుచిని, ఆరోగ్యానికి ఆరోగ్యాన్ని అందిస్తుందని కొనియాడారు. కేవలం ఆరోగ్య ప్రయోజనాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడంలో ఉసిరి కీలక పాత్ర పోషిస్తోందని ఆయన వివరించారు. ఈ స్థానిక ఫలాన్ని ప్రోత్సహించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు పౌష్టికాహార భద్రతను కూడా బలోపేతం చేయవచ్చని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాను ప్రధాని మోదీ ఉదాహరణగా చూపించారు. ఈ ప్రాంతానికి ఉసిరితో శతాబ్దాల అనుబంధం ఉందని, ప్రస్తుతం ‘ఒక జిల్లా - ఒక ఉత్పత్తి’ (ఓడీఓపీ) పథకం కింద ఇక్కడి ఉసిరి పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రతాప్‌గఢ్‌లో దాదాపు 100 ఉసిరి ప్రాసెసింగ్ యూనిట్లు పనిచేస్తున్నాయని, వీటిలో మహిళా స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. దేవ్‌గఢ్ కమాసీ గ్రామంలోని సావిత్రి పూలే స్వయం సహాయక బృందం ఉసిరితో క్యాండీ, మురబ్బా, జ్యూస్ వంటివి తయారు చేస్తోందని, వింధ్యవాసిని బృందం పచ్చళ్లు, జీర్ణశక్తిని పెంచే పొడులను ఉత్పత్తి చేస్తోందని మోదీ ఉదహరించారు. ప్రభుత్వ సహకారంతో యంత్రాలు, రుణాలు, మార్కెట్ సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల ఈ మహిళల ఆదాయం గణనీయంగా పెరిగిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఉసిరిలో ఉండే పోషక విలువల గురించి కూడా ప్రధాని మాట్లాడారు. నారింజ పండుతో పోలిస్తే ఉసిరిలో అనేక రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉంటుందని శాస్త్రీయంగా నిరూపితమైందని గుర్తుచేశారు. విటమిన్ సి తో పాటు యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, ఇతర సూక్ష్మ పోషకాలు ఉసిరిలో పుష్కలంగా ఉంటాయన్నారు. దీనిని రోజూవారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు, జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందని, చర్మం, జుట్టు ఆరోగ్యం కూడా బాగుంటుందని పేర్కొన్నారు. రక్తంలో చక్కెర స్థాయిలు, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలోనూ ఉసిరి సహాయపడుతుందని ప్రధాని వివరించారు. మన ఇళ్లలో ఊరగాయలు, మురబ్బా, చ్యవన్‌ప్రాశ్ వంటి రూపాల్లో ఉసిరిని ఎప్పటినుంచో వాడుతున్నామని, ఈ సంప్రదాయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రధాని కోరారు. ఉసిరి వంటి స్థానిక సూపర్‌ఫుడ్‌లను ప్రోత్సహించడం ‘ఓకల్ ఫర్ లోకల్’ నినాదానికి నిజమైన స్ఫూర్తినిస్తుందని అన్నారు. తక్కువ ధరకే లభించే ఇలాంటి పోషకాహారం ద్వారా దేశంలో పోషకాహార లోపాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని, తద్వారా ఆరోగ్యవంతమైన, స్వావలంబన కలిగిన భారతదేశాన్ని నిర్మించవచ్చని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.

## ఆయుధాలు కొంటారా?..

# జిన్‌పింగ్‌ను నేరుగా అడిగిన ట్రంప్!

ఢిల్లీ: ‘అమెరికా ఆయుధాలు కొనుగోలు చేస్తారా?’ అంటూ చైనా అధ్యక్షుడు జెన్‌పింగ్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేరుగా అడిగేశారు. ఈ విషయాన్ని చైనాలో అమెరికా రాయబారి డేవిడ్ పెర్ద్యూ వెల్లడించారు. ‘ఫాక్స్ న్యూస్ సండే’ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని బయటపెట్టారు. చైనా అధ్యక్షుడిని వాషింగ్టన్‌లో పర్యటించాల్సిందిగా ట్రంప్ ఆహ్వానించిన కొన్ని రోజులకే ఈ విషయం బయటకు రావడం గమనార్హం. ఈ విషయంపై పెర్ద్యూ మాట్లాడుతూ “అధ్యక్షుడు ట్రంప్ ఎప్పుడూ చెబుతుంటారు, మనం ప్రపంచవ్యాప్తంగా ఇతరులకు ఆయుధాలు అమ్ముతామని. ఒకసారి ఆయన చైనా అధ్యక్షుడిని, ‘మీరు కొన్ని కొనాలనుకుంటున్నారా?’ అని అడిగారు” అని వివరించారు. తైవాన్‌కు అమెరికా ఆయుధాలు అమ్మే విషయంపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తైవాన్‌కు 14 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాల ప్యాకేజీ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉంది. గత డిసెంబర్‌లో కూడా ట్రంప్ 11.1 బిలియన్ డాలర్ల ఆయుధాలను తైవాన్‌కు అమ్మేందుకు అనుమతించారు. అయితే, అమెరికా చట్టం ప్రకారం చైనాకు ఆయుధాలు అమ్మడంపై పూర్తి నిషేధం ఉంది. ఈ నేపథ్యంలో వైట్ హౌస్, స్టేట్ డిపార్ట్‌మెంట్ వెంటనే స్పందించాయి. చైనాకు ఆయుధాలు అమ్మే ప్రణాళిక గానీ, అటువంటి ఆఫర్ గానీ ఏదీ లేదని స్పష్టం చేశాయి. మరోవైపు, తైవాన్ విషయంలో ట్రంప్ విధానంలో ఎలాంటి మార్పు లేదని, ఆయన వైఖరి బలంగా ఉందని పెర్ద్యూ పేర్కొన్నారు. అయితే ట్రంప్ ఆఫర్‌కు జిన్‌పింగ్ ఎలా స్పందించారన్న వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

## చిత్తూరులో సంచరిస్తున్న ఏనుగులను అడవిలోకి మళ్లించాలి

అమరావతి: చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను, రైతులను భయాందోళనలకు గురిచేస్తున్న ఏనుగుల గుంపును వెంటనే అడవిలోకి సురక్షితంగా మళ్లించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముసలమడుగు శిబిరం నుంచి కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. సోమవారం పడిపుట్లబైలు సమీపంలో ఏనుగుల సంచారంపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత 15 రోజులుగా 11 ఏనుగులతో కూడిన గుంపు, దాని నుంచి విడిపోయిన మరో రెండు ఏనుగులు పడిపుట్లబైలు పంచాయతీ పరిధిలోని పుండ్లవల్లపల్లి, నడింపల్లి, కొండకిందపల్లి గ్రామాల్లో సంచరిస్తున్నాయని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఏనుగులు వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఒక ఏనుగుల గుంపు రహదారి దాటి మంగళంపేట బీట్‌లోకి ప్రవేశించగా, మరో రెండు ఏనుగులు చిత్తూరు వైపు కదులుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ ఏనుగుల సంచారం వల్ల పాకాల, పులిచెర్ల, చంద్రగిరి మండలాల ప్రజలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మానవ-ఏనుగు ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. “ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. అటవీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖలు, హనుమాన్ బృందాలు సమన్వయంతో పనిచేయాలి. క్షేత్రస్థాయి బృందాలు నిరంతరం నిఘా ఉంచి, ప్రమాదం పొంచి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలి” అని ఆయన స్పష్టం చేశారు. ఏనుగుల వల్ల పంట నష్టపోయిన రైతులకు తక్షణం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూసుకుంటూనే, ఏనుగులను సురక్షితంగా తిరిగి అటవీ ప్రాంతంలోకి మళ్లించే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల భద్రత, పంటల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఉద్ఘాటించారు.

## బహదూర్‌గూడ భూములు ప్రభుత్వానివైతే..

# పోలీసుల పహారా ఎందుకు?

హైదరాబాద్: బహదూర్‌గూడ భూములు ప్రభుత్వానివే అయితే.. పోలీసుల పహారా ఎందుకని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. 420 హామీలు ఇచ్చి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆయన విమర్శించారు. రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు భూములు తీసుకుంటున్నారని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా బహదూర్‌గూడకు చెందిన రైతులతో తెలంగాణ భవన్‌లో ఆయన సమావేశమయ్యారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు భూములు కోల్పోయే రైతులతో మాట్లాడారు. “బహదూర్‌గూడ రైతుల సమస్య గతంలో కేసీఆర్ దృష్టికి తెచ్చిఉంటే.. 10 నిమిషాల్లో పరిష్కరించేవారు. ఇందిరమ్మ రాజ్యం అంటే.. పెద్దల భూములు ముట్టకుండా పేదల భూములు తీసుకోవడమా? బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో పేదల భూములు కొల్లగొడితే ఊరుకునేది లేదు. ఈ పేదల తరఫున పోరాడేందుకు బీఆర్ఎస్ ఉంది. భూములు కొనడం.. అమ్మడమే.. రేవంత్‌రెడ్డికి తెలిసిన ఏకైక విద్య. ఫార్మాసిటీకి సేకరించిన భూములను రైతులకు తిరిగి ఇస్తామని గతంలో అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఫార్మాసిటీ భూములు తిరిగి ఎందుకు ఇవ్వలేదు?” అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కసరత్తు.. ఎమ్మెల్సీ స్థానాలు ఎవరికి?



హైదరాబాద్: తెలంగాణలో ఖాళీ కానున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు ముమ్మరం చేసింది. వరంగల్-ఖమ్మం-నల్గొండ, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేయబోయే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పీసీసీ చేపట్టింది. ఈ రెండు స్థానాల పదవీకాలం 2027 మార్చిలో ముగియనుంది. ఒక్కో స్థానానికి ముగ్గురు చొప్పున మొత్తం ఆరుగురు పేర్లతో పీసీసీ జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ జాబితాను పీసీసీ అధ్యక్షుడు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు పంపినట్లు తెలుస్తోంది. వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ముగ్గురి పేర్లను ప్రతిపాదించగా.. అభ్యర్థి ఎంపిక బాధ్యతను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అప్పగించినట్లు సమాచారం. అదే విధంగా హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానానికి అభ్యర్థి ఎంపిక బాధ్యతను మంత్రి దామోదర్ రాజనర్సింహకు అప్పగించినట్లు తెలుస్తోంది. అభ్యర్థుల ఎంపికలో ప్రధానంగా సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలతో పాటు త్వరలో ఖాళీ కానున్న గవర్నర్ కోటాలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలను కూడా కలిపి సామాజిక సమీకరణాలను బ్యాలెన్స్ చేసేలా అభ్యర్థుల ఎంపిక చేపట్టనున్నట్లు తెలుస్తోంది. గవర్నర్ కోటా మూడు స్థానాల పదవీకాలాలు నవంబర్‌లో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎలాంటి సామాజిక సమీకరణాలు ఉండాలన్న దానిపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై తీసుకునే నిర్ణయాన్ని బట్టి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల విషయంలోనూ తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సెప్టెంబర్ 29న ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్టానం కీలక సమావేశం నిర్వహించి అభ్యర్థులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఓటర్ల జాబితా పునఃసిద్ధీకరణ ప్రక్రియకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. నవంబర్ 6 వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తులు స్వీకరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు. దీంతో అధిష్టానం తీసుకునే తుది నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# అక్టోబరు 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు.. పూర్తి షెడ్యూల్ ఇదే!

తిరుపతి: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు విడుదల చేశారు. ఇటీవలే టీటీడీ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దసరా బ్రహ్మోత్సవాలకు సన్నద్ధమవుతోంది. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడేళ్లకోసారి వచ్చే అధికమాసం కారణంగా ఈ ఏడాది స్వామివారికి రెండోసారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కన్యామాసంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగగా, దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆశ్వయుజ మాసంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయతీ. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం ఉండవని టీటీడీ స్పష్టం చేసింది. ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ప్రతిరోజూ ఉదయం, రాత్రి వేళల్లో వివిధ వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబరు 16న అత్యంత కీలకమైన గరుడ వాహన సేవ, అక్టోబరు 19న స్వర్ణరథం, అక్టోబరు 20న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

సాధారణంగా ఉదయం వాహన సేవలు 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి సేవలు 7 నుంచి 9 గంటల వరకు జరుగుతాయి.



అయితే, గరుడ వాహన సేవ మాత్రం అక్టోబరు 16న సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 11:30 గంటల వరకు కన్నుల పండువగా జరగనుంది.

నవరాత్రి బ్రహ్మోత్సవాల వాహన సేవల పూర్తి షెడ్యూల్:

అక్టోబరు 11: అంకురార్పణం (రాత్రి 7 నుంచి 9 గంటల వరకు), అక్టోబరు 12: బంగారు తిరుచ్చి ఉత్సవం (ఉదయం 9 గంటలకు), పెద్దశేష వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 13: చిన్నశేష వాహనం (ఉదయం 8 గంటలకు), హంస వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 14: సింహ వాహనం (ఉదయం 8 గంటలకు), ముత్యపుపందిరి వాహనం (రాత్రి 7 గంటలకు),, అక్టోబరు 15: కల్పవృక్ష వాహనం (ఉదయం 8 గంటలకు), సర్వభూపాల వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 16: మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు), గరుడ వాహనం (సాయంత్రం 6:30 గంటలకు), అక్టోబరు 17: హనుమంత వాహనం (ఉదయం 8 గంటలకు), పుష్పక విమానం (సాయంత్రం 4 గంటలకు), గజ వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 18: సూర్యప్రభ వాహనం (ఉదయం 8 గంటలకు), చంద్రప్రభ వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 19: స్వర్ణరథం (ఉదయం 7 గంటలకు), అశ్వ వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 20: చక్రస్నానం (ఉదయం 6 గంటలకు), అక్టోబరు 20వ తేదీ ఉదయం జరిగే చక్రస్నానంతో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

## వరదలు,భారీ వర్షాల వలన పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలి

- నష్టపోయిన రైతుల రుణాలు మాఫీ చేయాలి. పంటల బీమా పథకం వర్తింప చేయాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్



ఏలూరు, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ::: గోదావరి వరదలు, భారీ వర్షాల వలన పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు సోమవారం ఏలూరు, అన్నే భవనంలో వరదలు, ఇటీవల కురిసిన భారీ వర్షాల పంట నష్టాలపై ఆయన మాట్లాడారు. గోదావరి వరదలు,భారీ వర్షాల వలన జిల్లాలో వేలాది ఎకరాలలో పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి తీర ప్రాంతంలో మిరప పంటకు, నూజివీడు, ముసునూరు మండలాల్లో అరటి పంటకు, కృష్ణా డెల్టా పరిధిలో మినుము పంటకు, జిల్లాలకు ప్రాంతాల్లో వరి, కూరగాయలు, ఆయిల్ పామ్ తదితర పంటలకు వేలాది ఎకరాలలో నష్టం వాటిల్లిందని చెప్పారు. పంట నష్టాలు ఎన్యుమరేషన్ వెంటనే ప్రారంభించాలని కోరారు. పంట ఏ మేరకు నష్టం జరిగితే ఆ మేరకు నష్టాలను నమోదు చేయాలన్నారు. ఉద్యాన పంటలకు ఎకరాకు రూ.50వేలు, వరి,మినుములు,ఇతర ఆహార పంటలకు ఎకరాకు రూ. 25వేలు తక్షణ పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన అన్ని పంటల రైతులకు పంటల బీమా పథకం వర్తింపజేయాలని, వారు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని కోరారు. కౌలురైతులు, పేద రైతులు ప్రైవేట్ అప్పులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, వారి ప్రైవేట్ అప్పులు మాఫీకి ప్రభుత్వ సహాయం అందించాలని కోరారు. పంటలు నష్టపోయిన కౌలు రైతులకే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులను ఆదుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## 150 సం.ల ఒంగోలు గీతానికి చిన్మయి నృత్యాభినయం

--- వీక్షకులచే ప్రశంసలు అందుకున్న చిన్నారి



ఒంగోలు, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ::: ఒంగోలు నగర 150 సంవత్సరాల వేడుకల సందర్భంగా పట్టణ ఖ్యాతిని చాటుతూ ప్రముఖ రచయిత జంధ్యం రాధా రమణ గుప్తా రచించిన ప్రత్యేక గీతానికి చిన్నారి చిన్మయి చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది, వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గుంటూరు రుద్ర కళాక్షేత్రం నిర్వాహకులు, నృత్య గురువు మాచిరాజు రాజేష్ పర్యవేక్షణలో చిన్మయి అద్భుత అభినయంతో రసజ్ఞులను మురిపించింది. చిన్నారి ప్రదర్శన పట్ల ఆమె తల్లిదండ్రులు నువ్వల వీరేంద్రబాబు, సురేఖ సంతోషం వ్యక్తం చేశారు. ఒంగోలు విశిష్టతను తెలిపే అద్భుతమైన గీతాన్ని అందించిన జంధ్యం రాధా రమణ గుప్తాకు, చిన్నారికి శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దిన నృత్య గురువు మాచిరాజు రాజేష్‌కు వారు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ --- "మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు శాస్త్రీయ నృత్య కళలను చిన్నతనం నుంచే పిల్లలకు అలవాటు చేయాలి. అప్పుడే మన ప్రాచీన విజ్ఞాన సంపదను, గొప్ప వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించినవారమవుతాం" అని పేర్కొన్నారు.

## గాడాల గ్రామంలో శరవేగంగా నిర్మిస్తున్న ఆలయాల నిర్మాణానికి దాతలు విరాళాలిచ్చి సహకరించండి..!!

- ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు, గాడాల మాజీ ఉప సర్పంచ్ సుతాపల్లి శ్యామలరావు



కోరుకొండ. సెప్టెంబర్ 28, నేటి శుభోదయ జిల్లా ప్రతినిధి (ఏ.కె) : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం గాడాల గ్రామంలో శ్రీ వినాయక, శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు, శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధి సుతాపల్లి శ్యామలరావు తెలిపారు. శ్యామలరావు తన నివాసంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజల నిర్వహించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ..గ్రామంలో నిర్మిస్తున్న ఈ ఆలయాల నిర్మాణ కార్యక్రమానికి భక్తులు, దాతలు ఉదారంగా స్వచ్ఛందంగా విరాళాలు అందజేసి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఆలయాల నిర్మాణం వేగంగా కొనసాగుతుందని శ్యామల రావు తెలిపారు. దాతలు ఇచ్చే రూ.100 నుండి ఎంత మొత్తానికైనా వెంటనే రసీదు అందించబడుతుంది. పది వేల పై నుంచి రూ.1,00,000 (లక్ష రూపాయలు) లేదా అంతకంటే ఎక్కువ విరాళం అందించిన దాతల పేర్లను ఆలయ ఆవరణలోని పాలరాతి ఫలకంపై శాశ్వతంగా చెక్కిస్తామని వెల్లడించారు. విరాళాలను స్వయంగా ఆలయం వద్ద ఉన్న శ్యామలరావుకి అందజేయవచ్చు లేదా డిజిటల్ విధానంలో ౫ాష్ట్రశీఅవూవ ద్వారా కూడా పంపవచ్చని తెలియజేశారు. త్వరలో ఆలయాల నమూనా తో కూడిన కర పత్రాలు, కమిటీ సభ్యులతో దాతలను స్వయంగా కలుసుకోవడం జరుగుతుందని శ్యామలరావు వెల్లడించారు.

## డిగ్రీకాలేజీలో ఘనంగా గుర్రం జాషువా జయంతి




చింతూరు, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ::: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ తెలుగు కవి, సామాజిక చైతన్య వేత్త గుర్రం జాషువా జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్. మణిమాల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ డా.ఎన్. మణిమాల మాట్లాడుతూ గుర్రం జాషువా తన రచనల ద్వారా సామాజిక అసమానతలు, అంటరానితనం, కుల వివక్ష వంటి సమస్యలపై ప్రజల్లో చైతన్యం కలిగించారని తెలిపారు. సమాజంలో సమానత్వం, మానవత్వం, సామాజిక న్యాయం నెలకొల్పేందుకు ఆయన సాహిత్యం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో జాషువా రచనలకు విశిష్ట స్థానం ఉందని, విద్యార్థులు జాషువా జీవిత చరిత్ర, సాహిత్య కృషి సామాజిక దృక్పథాన్ని తెలుసుకోవాలని సూచించారు. తెలుగు అధ్యాపకురాలు కోట్ల లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ గుర్రం జాషువా సమకాలీన కవిత్వ వరవడి అయిన భావ కవిత్వరీతి నుండి పక్కకు జరిగి సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశారని అన్నారు. గుర్రం జాషువా చీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.వై.పద్మ, ఎం. రాకేష్ రాజ్, డా. జె.శివకృష్ణ, కె.సత్య గణేష్, డా.జి.ఝాన్సీ, బి. శ్రీనివాసరావు, ఎన్.ఆనంద్, కె. కీర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆదర్శ విప్లవ కమ్యూనిస్టు వడ్డె నాగయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు




ఖమ్మం, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ::: సిపిఐ ఎంఎల్ మాస్ లైన్( ప్రజాపంథా) సీనియర్ నాయకులు వడ్డే నాగయ్య నిస్వార్ధంగా, విప్లవ కమ్యూనిస్టు భావజాలంతో,పేద ప్రజల కోసం తన శక్తివంచన లేకుండా పాటుపడిన గొప్ప ఆదర్శ నాయకుడని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కొనియాడారు. సోమవారం ఖమ్మంలో, హరిత గార్డెన్స్ లో వడ్డే నాగయ్య సంతాప సభను పార్టీ డివిజన కమిటీ ఆధ్వర్యంలోజిల్లానాయకురాలు సిహెచ్ శిరోమణి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. సభకు హాజరైన బంధువులు, పార్టీ శ్రేణులు, నాయకులు వడ్డే నాగయ్యకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పో టు రంగారావు ప్రసంగిస్తూ, వడ్డే నాగయ్య ప్రజలను ప్రేమించాడని, వారి కష్టసుఖాలలో పాలుపంచుకున్నాడని వారికి ఏ సమస్య వచ్చినా ఆప్తుడుగా ఉండి పరిష్కారం చేయడంలో ముందుభాగాల నిలిచాడని ఆయన కొనియాడారు, రఘునాధపాలెం,కొనిజర్ల మండలంలో పేద ప్రజలు కొట్టుకున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పేద ప్రజలు నివసించడానికి కొత్త గ్రామాలను పార్టీ ఆధ్వర్యంలో నిర్మించారని, పార్టీ నాయకులు పొట్లపల్లి శ్రీశైలం, వల్లూరు వెంకయ్యలతో కలిసి పార్టీ అభివృద్ధి కోసం, ప్రజల బాగు కోసం కృషి చేసిన మహనీయుడని ఆయన అన్నారు. సారా వ్యతిరేక ఉద్యమంలో సారాను బంద్ పెట్టాలని పోరాటం చేసిన మహిళలను పోలీసులు గ్రామ నడి వీధిలో నిలబెట్టి, నిర్బంధించి, అవమానపరిచారని, భయపడకుండా, ఎంతో ధైర్యంతో మహిళలను చైతన్యపరిచి, పోలీసు ఆగడాలను, అరాచకాలను ఎదిరించి, ఊరిని, ప్రజలను కాపాడుకున్న గొప్ప నాయకుడని ఆయన అన్నారు. 1970నుండి విప్లవ కమ్యూనిస్టు పార్టీని గ్రామంలో నిర్మాణం కోసం ప్రయత్నం చేస్తూ పార్టీని నిలబెట్టకు కృషి చేశారని, ఎమర్జెన్సీ కాలంలో ఆ తర్వాత కూడా రహస్య కామ్రేడ్లకు షెల్టర్ గా వేపకుంట్ల గ్రామాన్ని తయారు చేశారని, తన ఇల్లును కూడా విప్లవకారులకు ఆశ్రయంగా బలిసినాడని నిర్బంధ ఉన్నప్పటికీ బెదరకుండా ఆటు కోట్లు వచ్చిన ఎదుర్కొని పార్టీ క్రమశిక్షణ పాటించిన మహానీయులని ఆయన అన్నారు. సరియైన విధానాలు అనుసరిస్తూ, ప్రతినిత్యం న్యూస్ పేపర్లు చదివి రచ్చబండ చర్చలు దేశ పరిణామాలు రాజకీయ విశ్లేషణ చేసి పార్టీ విధానాలు ఆర్గ్యుమెంట్ చేసే వాడని,మంచి క్రమశిక్షణ, నిబద్ధతకలిగి,నిజాయితీగా ఉండేవాడని, నమ్మిన సిద్ధాంతం పట్ల, నాయకుల పట్ల అచంచల విశ్వాసంతో ఉన్న కమ్యూనిస్టు విప్లవ నాయకుడని, గ్రామంలో విద్య అభివృద్ధి కోసం, ఆలేర్ల వ్యవసాయ కూలీల వేతనాల పెంపుదల కోసం రైతాంగ పంటలకు గిట్టుబాటు ధరల కోసం,తునికాకు రేట్ల పెంపుదల కోసం, భూపోరాటాలు చేసి, పేద ప్రజలకు భూములు పంచడానికి కృషిచేసిన ప్రజల మనిషనీ అయన అన్నారు. 1981 నుండి 88 వరకు వేపకుంట్ల గ్రామానికి ఉపసర్పంచిగా, ఉండి చెరువుకొమ్ము తండా వేపకుంట్ల ఎస్సీ బీసీ కాలనీలకు విద్యుత్, రోడ్ల సౌకర్యాల కోసం అధికారుల వెంటబడి పరిష్కారం కోసం కృషి చేశాడని ఆయన అన్నారు. పార్టీ నాయకులు అమరులు రాయల సుభాష్ చంద్రబోస్, శ్రీశైలం, ధర్మన్న, ఎల్లన్న, రాయల నాగేశ్వరరావు తదితరుల సహచర్యంతో పేద ప్రజలను అమితంగా ప్రేమించి వారికోసం నిలబడిన విశాల హృదయం కలిగిన మనిషిని ఆయన అన్నారు. నేడు దేశంలో రాష్ట్రంలో పాలకులుగా ఉన్నవారు ప్రజల మీద అనేక రకాలుగా భారాలను మోపి ఇబ్బందులు పాలు చేస్తున్నారని పేద ప్రజలు మరింత పేదలుగా మారిపోతున్నారని, ప్రజలు చీలిపోకుండా ఐక్యంగా ఉండే ప్రభుత్వాల తప్పుడు విధానాలపై పోరాటాలు చేసి ఓడించాలని కోరారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ ఓట్ల చోరీ చేసి లక్షలాదిమంది యువతి యువకుల ఓట్లను గల్లంతు చేశాడని ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం అన్ని రంగాలను తన చేతిలోకి తీసుకొని, తమ అధికారాన్ని కాపాడుకోవటం కోసం దుర్వినియోగం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యంగా అదాని,అంబానీలను వెంటబెట్టుకొని దేశ సంపదను వారి చేతుల్లో పెడుతున్నారని ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సంతాప సభలో సర్పంచ్ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు పూసులూరి నరేందర్,కవి ఎన్ తిరుమల్,పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, పార్టీ జిల్లా నాయకులు జిరామయ్య,ఆవుల అశోక్, ఆర్ శివలింగం,మలీదు నాగేశ్వరరావు,ఖమ్మం డివిజన్ కార్యదర్శి టీ ఝాన్సీ, బందెల వెంకయ్య, తిమ్మిడి డి హనుమంతరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, కె శ్రీనివాస్,పి శోభ,పోలిశెట్టిగూడెం మాజీ సర్పంచ్ రామయ్య,చావా రాము, కోయిని వెంకన్న,పార్టీ మండల కార్యదర్శి కేలోత్ లక్ష్మణ్, మేక రామనాథం,కురాకుల నరసయ్య, జాలాది లెనిన్, నాగయ్య అల్లుడు గుర్రం రవీంద్రావు, కుమారులు వడ్డే రామారావు,వడ్డే వీరభద్రం, భార్య అనసూర్యమ్మ, ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా జర్నలిస్టులు రాం నా రాయణ, ఏనుగు వెంకటేశ్వరావు, నర్వనేని వెంకటావు, యెగినాటి మాధవరావు, చెరుకుపల్లి శ్రీనివాసరావు, పోటు శ్రీనివాసరావు, నామా పురుషోత్తం, అప్పారావు, కె గణేష్, తుమ్మలపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



## సీతానగరం మండలంలో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే బలరామకృష్ణ..!!

పంట నష్టం అంచనా వేసి, వెంటనే నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం..!



కోరుకొండ, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలం కాటవరం గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాలను స్థానిక శాసనసభ్యులు, బత్తుల బలరామకృష్ణ సోమవారం స్వయంగా పరిశీలించారు. వర్షపు నీటిలో దిగి దెబ్బతిన్న వరి, ఇతర పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తీవ్రంగా నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ... 'భారీ వర్షాల వల్ల కాటవరం పరిసర ప్రాంతాల్లో రైతులు ఎంతో కష్టపడి సాగు చేసిన పంటలు నీటమునిగి తీవ్రంగా నష్టపోవడం బాధాకరం అన్నారు. రైతాంగాన్ని అన్ని వేళలా ఆదుకోవడమే మన కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. ఏ ఒక్క రైతు ధైర్యం కోల్పోవాల్సిన అవసరం లేదు, ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది' అని హామీ ఇచ్చారు.అలాగే, క్షేత్రస్థాయిలో ఉన్న వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో ఆయన మాట్లాడి, వెంటనే ముంపునకు గురైన ప్రతి ఎకరాన్ని పరిశీలించి త్వరితగతిన పంట నష్టం అంచనా వేసి సమగ్ర రిపోర్ట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. అధికారుల నివేదిక ఆధారంగా నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకూ ప్రభుత్వ పరంగా తగిన పరిహారం మరియు సహాయక చర్యలు అందేలా చూస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

## కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో

"యువత భవితకు భరోసా"

కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ..



అనంతపురం, బ్యూరో సెప్టెంబర్ 28 నేటి శుభోదయ :అనంతపురం నగరంలోని కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో నిర్వహించిన "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థినులకు అందుతున్న వసతులు, విద్యా సౌకర్యాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో మహిళా విద్యకు ఈ కళాశాల అందిస్తున్న సేవలు, విద్యార్థినుల ఆదరణ అభినందనీయం అన్నారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, విద్యార్థినుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు, అదనపు తరగతి గదుల ఏర్పాటుకు ప్రభుత్వం తరపున కృషి చేస్తామన్నారు. ప్రతి విద్యార్థిని తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, కష్టపడి చదవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు కమ్యూనికేషన్, టెక్నాలజీ, ఇతర నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ఎంతో అవసరం అని అన్నారు. అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని, ఇంటర్వ్యూలు మరియు పోటీ పరీక్షలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకుని మంచి ఉద్యోగ అవకాశాలను సాధించాలని కోరారు. జిల్లాలోని బి సి స్టడీ సర్కిల్‌ను పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం యువతకు మెరుగైన భవిష్యత్తును నిర్మించుకునేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో విద్య, ఉపాధి, సంక్షేమ రంగాల అభివృద్ధికి గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గారు చేస్తున్న కృషికి అనుగుణంగా జిల్లాలో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి, అన్నపూర్ణ, హాస్పిటల్ కమిటీ సభ్యులు నరసింహులు, వెంకటేశ్వర్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు.




## రాజానగరం నియోజకవర్గంలో రహదారులకు మహార్దశ..!!

- సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రికార్డు స్థాయిలో

19 భారీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు, అభివృద్ధి కార్యక్రమాలకు పరుగులు..!




కోరుకొండ, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో పలు ముఖ్యమైన రోడ్లకు శంకుస్థాపనలు.. అభివృద్ధి కార్యక్రమాలు భారీ ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేసారు. ఈ మేరకు ఆయన కార్యాలయం వర్గాలు సోమవారం వాటి వివరాలు మీడియాకు అందించారు.

### ఈ నెల 30 వ, బుధవారం రూట్ మ్యాప్.. వివరాలు..

ఉదయం 8.30 గం.లకు రఘునాధపురం గ్రామంలో రూ.1.70 కోట్లతో శ్రీరాంపురం నుండి రఘునాధపురం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన. ఉదయం 9 గం.లకు రాధేయపాలెం గ్రామంలో రూ.1.56 కోట్లతో కానవరం - రాధేయపాలెం నుండి, మేడపాడు (పేపర్ మిల్లు వద్ద) రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన. ఉదయం 9.30 గం.లకు వెలుగుబంధ గ్రామంలో రూ.1.30 కోట్లతో రాజానగరం నుండి వెలుగుబంధ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహిస్తారు. ఉదయం 10.30 గం.లకు మధురపూడి గ్రామంలో రూ.1.29 కోట్లతో మధురపూడి దుర్గమ్మ గుడి వద్ద నుండి గాడాల తొర్రేడు =ణ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఉదయం 11 గం.లకు మిర్తిపాడు - బుచ్చెంపేట గ్రామంలో రూ.2.63 కోట్లతో బొబ్బిల్లంక నుండి బుచ్చెంపేట రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 11.30 గం.లకు గుమ్ములూరు గ్రామంలో రూ.1.85 కోట్లతో గుమ్ములూరు (జగన్నాధపురం) పంచాయతి ఆఫీస్ నుండి మధురపూడి పుంత రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుంది. మధ్యాహ్నం 12.30 గం.లకు కూనవరం గ్రామంలో రూ.1.30 కోట్లతో మునికూడలి నుండి కాటవరం - కూనవరం కలిపే డీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన..నిర్వహిస్తారని ఎమ్మెల్యే 'బత్తుల' కార్యాలయం వర్గాలు తెలియజేశాయి. పెద్ద ఎత్తున జరుగుతున్న పై కార్యక్రమాల షెడ్యూల్ గమనించి రాజానగరం నియోజకవర్గంలోని జనసేన/ తెలుగుదేశం/ బిజెపి/ నాయకులు/ కార్యకర్తలు/ జనసైనికులు/ వీర మహిళలు/ ఆయా గ్రామా ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేసి కూటమి ప్రభుత్వం ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేశారు.

## 'ఇంటర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 19వ వార్షిక గణేశ ఉత్సవాలు"



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 28 (నేటి-శుభోదయ): ప్రజలందరికీ వినాయకుని ఆశీస్సులు ఉండాలనే ఆశయంతో సంప్రదాయబద్ధంగా వినాయక చవితి ఉత్సవాలను గత 19 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని ఇంటర్ లారీ ఓనర్స్అసోసియేషన్ కార్యదర్శి గురుజు సూరిబాబు తెలిపారు. స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 19వ వార్షిక వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మీడియా తో మాట్లాడుతూ పట్టణంలోని లారీ యజమానులందరూ ఐకమత్యంతో సుదీర్ఘకాలంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు.గరిక పూజ, రుద్రాభిషేకం,గణపతి హోమం, జ్యోతిర్లింగార్చన తదితర విశేష పూజలను నిర్వహించామని,గణపతి ఆశీస్సులతో వ్యాపార అభివృద్ధి, ప్రజల సంక్షేమం సమృద్ధిగా జరగాలని ఆకాంక్షించారు.ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం భారీ ఊరేగింపును నిర్వహించారు. భారీ బ్యాండ్,విచిత్ర వేషధారణ, తీన్మార్, శక్తి వేష ధారణలు,బుట్ట బొమ్మలు, అఘోరాలతో, బాణాసంచా వెలుగులతో పురవీధులలో జరిగిన ఈ శోభా యాత్ర పట్టణ ప్రజలను విశేషంగా ఆకర్షించింది.వారం రోజులలో భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని, ప్రజలందరూ పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించి గణపతి ఆశీస్సులు పొందాలని సూరిబాబు కోరారు. ఈ కార్యక్రమంలో వసంత కుమార్,అడ్డగర్ల సత్యనారాయణ,పాలూరి బలుసులరావు,సత్తి బలుసులు తదితరులు ఉత్సవాల నిర్వహణకు సేవలందించారు.



# ఖమ్మం ఉమ్మడి జిల్లాలో బిఆర్ఎస్ లో అంతా నాయకులే

**- ఉమ్మడి ఖమ్మం గులాబీ పార్టీలో గుబులు పుట్టిస్తున్న వర్గవిభేధాలు**

**- ఖమ్మం, వైరా నుంచి అశ్వారావుపేట, ఇల్లందు వరకు వర్గ విభేదాలపై చర్చే**

**- గులాబీ పార్టీ పిలుపు ఒకటే, నేతల దారులు వేరా**

**- ఎవరి వెంట ఎవరు? ఎక్కడ ఎవరికి బలం**

**- ఎన్నికల తర్వాత మారిన రాజకీయ సమీకరణాలపై తర్జన భర్జనలు**

**- వద్దిరాజు, పువ్వాడ, కందాళ వెంట భజనపరులదే హవా**



ఖమ్మం, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ::: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) రాజకీయాలు మరోసారి చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఒకవైపు అధికార కాంగ్రెస్‌పై రాజకీయ పోరాటాలను విస్తరించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం కార్యక్రమాలు ప్రకటిస్తుండగా, మరోవైపు కొన్ని నియోజకవర్గాల్లో అంతర్గత సమన్వయం, నాయకుల మధ్య విభేదాలు, భజనపరుల మాటలతో ఆధిపత్య పోరు పై వరుస కథనాలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, పాలేరు, కొత్తగూడెం, వైరా, అశ్వారావుపేట, ఇల్లందు నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, నాయకుల మధ్య సమన్వయం, స్థానిక నాయకత్వంపై భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇవి రాజకీయ వర్గాలు, స్థానిక నాయకుల నుంచి వచ్చిన సమాచారంపై ఆధారపడిన కథనాలు మాత్రమేనని, బహిరంగంగా పార్టీ అంతర్గత నివేదికగా ధృవీకరించబడిన అంశాలుగా చూడరాదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

### ఖమ్మం, పాలేరు, కొత్తగూడెం, వైరాలో మూడు వర్గాల చర్చ

ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర, తాతా మధుసూదన్, నామ నాగేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య తో పాటు ఉద్యమకారులు తో కూడిన వర్గాలు తార స్థాయికి చేరాయి. ఏవరీ క్యాంప్ వారిదే అన్నట్లు రాజకీయాలు చేస్తూ గందరగోళం చేస్తున్నారు. ఆ పార్టీ లో ఒకరిపై ఒకరికి నమ్మకాలు లేవు అనేది సృష్టం అని చెప్పక తప్పదు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా బిఆర్ఎస్ పరాభవం తప్పదు అని తెలుస్తుంది. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అందరిని కలుపుకోవడంలో ఘోర వైఫ్యలం చెందారనే అపవాదు ఉంది మరి. ఇలా అయతే అజయ్ కుమార్ చేస్తున్న రాజకీయంగా కొందరికి నచ్చటం లేదు అని గట్టిగా చెప్పుతున్నారు. ఈ అంశాలపై ఆ పార్టీ అధిష్టానం సమన్వయం చేయకపోతే ఆ పార్టీకి మనుగడ కష్టంమే అని చెప్పకతప్పదు. మరోవైపు వైరా నియోజకవర్గంలో బానోత్ మనీషా లక్ష్మి వర్గం, మాజీ శాసనసభ్యురాలు డాక్టర్ బానోత్ చంద్రావతి వర్గం, తాతా మధుసూదన్ అనుచరులు గిరిబాబు వర్గాలుగా విడిపోయి ఎవరి రాజకీయాలు వారే చేస్తుండటం ఆ పార్టీలో వర్గాలుగా చీలిక ఏర్పడి రోడ్డున పడుతున్నారు. ఇలా అయితే ఆ పార్టీ మనుగడ ప్రశార్ధకంగా మారుతుంది. వైరా నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితి మూడు వర్గాలుగా కనిపిస్తోందంటూ ఇటీవల వెలువడిన రాజకీయ కథనం చర్చకు దారితీసింది. మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ కుమార్తె మనీషా ఒక వర్గానికి, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి మరో వర్గానికి, గిరిబాబు నాయకత్వంలో మరో వర్గం ఏర్పడిందంటూ ఆ కథనం పేర్కొంది. పార్టీ అధిష్ఠానం ఇచ్చే పిలుపులకైనా అన్ని వర్గాలు ఒకే వేదికపైకి రావడం కష్టంగా మారుతోందని, కార్యక్రమాల సమయంలో కూడా నాయకులు, కార్యకర్తల మధ్య ఘర్షణాత్మక పరిస్థితులు ఏర్పడుతున్నాయని అందులో పేర్కొన్నారు. అయితే ఈ వివరాలకు సంబంధించి సంబంధిత నాయకులందరి నుంచి ఒకే విధమైన అధికారిక ప్రకటన వెలువడినట్లు ఆధారం లేదు. అందువల్ల ఇది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చగానే చూడాల్సి ఉంటుంది. ఇది ఇలా ఉండగా పాలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా మూడు వర్గాలుగా చీలిక ఏర్పడిన పరిస్థితి ఇప్పుడు హాట్ ట్రాఫిక్ గా నడుస్తుంది. పాలేరు లో కందాళ, పువ్వాడ, సండ్ర కు చెందిన అనుచరులను కందాళ వర్గం కలుపుకొని పోవడం లేదు అనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఖమ్మం, వైరా, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో భజన పరుల మాటలతో పువ్వాడ, కందాళ, చంద్రావతి లు విని మరింత తప్పులు చేస్తున్నారు. ఈ తప్పులు కారణంగా పార్టీ ఉనికి కోల్పోయిన సందర్బం లేకపోలేదు. మరోవైపు ఎం పి వద్దిరాజు రవిచంద్ర పరిస్థితి ఆగమాగం అని చెప్పక తప్పదు. రవిచంద్ర కేవలం తనకు అనుకూలంగా ఉన్న భజనపరుల మాటలకే తగిన ప్రాధాన్యత ఇవ్వడం కారణంగా నష్టం జరుగుతుంది అనేది గమనించకపోవడం శోచనీయం. కేవలం రవిచంద్ర డబ్బులతో రాజకీయం చేయడం కూడా అతనికి తీవ్ర నష్టం చేస్తుంది. ఆయన కేవలం ప్రెస్ పేరుతో యూనియన్ నేతలు తన వెంటే ఉన్నారని, అందరూ తన వారే అని నమ్మి నష్టపోతున్నారు. దీనితో రవిచంద్ర కు అనుకూలంగా ఉన్నట్లు నటించడం షరా మాములే అని తెలుస్తుంది. అయన వారిని కాదు అని, కాని వారిని అవును అనడం రవిచంద్ర కు వెన్నతో పెట్టిన విద్య అని రాజకీయ మేధావులు చెవులు కొరక్కొవడం జరుగుతుంది. ఇలా అయితే రవిచంద్ర రాజకీయ భవిష్యత్తు శూన్యం అని చెప్పక తప్పదు.

### - పార్టీ కార్యక్రమమే, కానీ బలప్రదర్శన ఎవరిది

ఒకే కార్యక్రమం, వేర్వేరు శిబిరాలతో ఆ పార్టీ లో నష్టం జరుగుతుంది మరి. వైరాలో అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతోంది. పార్టీ పేరుతో జరిగే కార్యక్రమాల్లో కార్యకర్తలు, నాయకులు ఒకే వేదికపై కనిపించాల్సిన పరిస్థితిలో, నాయకత్వానికి సంబంధించిన అంతర్గత విభేదాలు బయటపడుతున్నాయనే ప్రచారం ఎందుకు వస్తోంది? పార్టీ కార్యక్రమాలకు హాజరయ్యే నాయకుల సంఖ్య, ఎవరెవరితో కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, ఎవరెవరు విడిగా సమావేశాలు పెడుతున్నారు అనే అంశాలే స్థానిక రాజకీయాల్లో చర్చకు కారణమవుతున్నాయి. ఇటీవల వచ్చిన కథనం ప్రకారం కార్యక్రమాల్లో తోపులాటల వరకు పరిస్థితులు వెళ్లిన సందర్భాలున్నాయని పేర్కొనడం మరింత చర్చకు దారితీసింది. ఈ ఆరోపణలను స్వతంత్రంగా నిర్ధారించాల్సి ఉంది.

### అశ్వారావుపేటలో అసలు చిచ్చు ఎక్కడ

#### తాటి వర్సెస్ మెచ్చా, ఆధిపత్య పోరుపై వరుస కథనాలు

అశ్వారావుపేటలో అంతర్గత విభేదాల చర్చ కొత్తది కాదు. మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు మధ్య రాజకీయ విభేదాలపై గతంలోనూ ఆరోపణలు ఉన్నాయి. 2026 జూలైలో వచ్చిన ఒక నివేదిక ప్రకారం మండల సమన్వయకర్త ఎంపిక తర్వాత పార్టీ శ్రేణుల్లో మళ్లీ విభేదాలు తలెత్తినట్లు పేర్కొంది. ప్రజాప్రతినిధులకు తగిన ప్రాధాన్యం, పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు వంటి అంశాలపై అసంతృప్తి ఉందని ఆ కథనం తెలిపింది. అయితే పార్టీ నాయకత్వం నుంచి ఈ అంశాలపై అధికారికంగా పూర్తి స్థాయి వివరణ వెలువడలేదని అదే నివేదిక పేర్కొంది.

### - ఒకే నియోజకవర్గం, రెండు రాజకీయ కేంద్రాలా

పార్టీ కార్యక్రమాల నిర్వహణలోనే విభేదాలు బయటపడుతున్నాయా అశ్వారావుపేటలో పరిస్థితిని గమనిస్తే మరో ఆసక్తికరమైన అంశం కనిపిస్తోంది. ఒకవైపు మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలు జరుగుతుండగా, మరోవైపు తాటి వెంకటేశ్వర్లు కూడా నియోజకవర్గంలో రాజకీయంగా చురుకుగా ఉన్నట్లు వివిధ వార్తా కథనాలు చెబుతున్నాయి. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఇరువైపులా జరిగిన సమావేశాలు, నిరసనలు, కార్యకర్తల కార్యక్రమాలు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు కారణమయ్యాయి. ఒకే పార్టీకి చెందిన నాయకులు వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించడం పార్టీ అంతర్గత సమన్వయంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నదని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

### చంద్రుగొండలో బయటపడిన రెండు బృందాల వ్యవహారం

ఒకే అంశం, రెండు బృందాలు., రెండు వినతిపత్రాలుఅశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని చంద్రుగొండలో ఇటీవల ఒకే అంశంపై భారత రాష్ట్ర సమితికి చెందిన నాయకులు రెండు వేర్వేరు బృందాలుగా వెళ్లి అధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్లు ఒక స్థానిక కథనం పేర్కొంది. ఒక బృందానికి మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు నాయకత్వం వహించగా, మరో బృందంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు సహా పలువురు నాయకులు ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఒకే పార్టీకి చెందిన నాయకులు ఒకే సమస్యపై వేర్వేరుగా కార్యక్రమాలు చేపట్టడం స్థానిక స్థాయిలో సమన్వయంపై చర్చకు దారితీసింది.

### - అశ్వారావుపేటలో ప్రశ్న ఒక్కటే

నియోజకవర్గానికి తుది నాయకత్వం ఎవరి చేతిలో ఉందో తెలియని పరిస్థితి. అశ్వారావుపేటలో జరుగుతున్న పరిణామాల వెనుక ప్రధాన రాజకీయ ప్రశ్న నాయకత్వ సమన్వయమే. ఎవరు నియోజకవర్గ బాధ్యతలు చూస్తారు? పార్టీ కార్యక్రమాలను ఎవరు సమన్వయం చేస్తారు స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ద్వితీయ శ్రేణి నాయకులు ఒకే నిర్ణయంతో ముందుకు వస్తారా అనే ప్రశ్నలు కార్యకర్తల్లో చర్చకు వస్తున్నాయి. ఇదే సమయంలో 2026లో కొన్ని వార్తా కథనాలు మెచ్చా నాగేశ్వరరావును నియోజకవర్గ బాధ్యతల్లో ఉన్న నాయకుడిగా పేర్కొన్నాయి. మరోవైపు తాటి వెంకటేశ్వర్లు కూడా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. దీంతో స్థానిక నాయకత్వంపై స్పష్టత ఎంతవరకు ఉందన్నదే ఇప్పుడు కీలక అంశంగా మారింది.

### - ఇల్లందు లోనూ పాత విభేదాలకు కొత్త రూపమా

హరిప్రియ నాయక్ చుట్టూ గతంలోనూ అసమ్మతి, ఇప్పుడు పరిస్థితి ఏమిటి ఇల్లందు భారత రాష్ట్ర సమితిలోనూ గతంలో అంతర్గత విభేదాలపై పలు వార్తా కథనాలు వెలువడ్డాయి. మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ నాయకత్వంపై అసమ్మతి వర్గం అభ్యంతరాలు వ్యక్తం చేసిన సందర్భాలు గతంలో నమోదయ్యాయి. 2025లో పట్టణ పార్టీ అధ్యక్ష పదవి నియామకంపై జిల్లా నాయకత్వం, నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్న హరిప్రియ నాయక్ వేర్వేరు పేర్లు ప్రకటించడంతో వివాదం తలెత్తినట్లు వార్తా కథనం పేర్కొంది. అంటే ఇల్లందు లో నాయకత్వ సమన్వయంపై చర్చకు గతంలోనే నేపథ్యం ఉన్నట్లు ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.

### - అయితే ఇల్లందులో ప్రస్తుత చిత్రం ఏంటి

విమర్శలు ఒకవైపు, పార్టీ కార్యక్రమాలు మరోవైపు

2026లో హరిప్రియ నాయక్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు వార్తలు కూడా వెలువడ్డాయి. ఆగస్టు చివర్లో ఇల్లెందు నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి బీఆర్ఎస్ నిర్వహించే కార్యక్రమాల్లో కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చినట్లు నివేదిక వెలువడింది. జూన్‌లోనూ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించినట్లు మరో నివేదిక పేర్కొంది. దీంతో ఇల్లెందులో పార్టీ కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయిన పరిస్థితి ఉందని చెప్పడం సరైనది కాదు; అయితే నాయకత్వం, సమన్వయంపై గతంలో ఉన్న విభేదాల ప్రభావం ఎంతవరకు కొనసాగుతోందన్నది పరిశీలించాల్సిన అంశం.

### ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌కు మారిన రాజకీయ సమీకరణాలు

అధికార పార్టీ నుంచి ప్రతిపక్షానికి, అక్కడి నుంచి అంతర్గత పునర్వ్యవస్థీకరణకు అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ రాజకీయ పరిస్థితి గణనీయంగా మారింది. గతంలో అధికారంలో ఉన్న సమయంలో వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక బలమైన నాయకత్వాలు ఒకే రాజకీయ వేదికపై ఉన్నప్పటికీ, ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత ఎవరి రాజకీయ ప్రాధాన్యం ఎంత అనే ప్రశ్నలు ముందుకు వచ్చాయి. 2022 నాటి నివేదికల్లోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సిట్టింగ్‌లు, మాజీ ఎమ్మెల్యేల మధ్య అంతర్గత పోటీ ఉన్నట్లు పేర్కొన్నారు. 2026 నాటికి కూడా అశ్వారావుపేట, ఇల్లందు వంటి ప్రాంతాల్లో నాయకత్వ సమన్వయంపై కథనాలు కొనసాగుతుండటం ఈ అంశానికి కొనసాగింపుగా రాజకీయ పరిశీలనకు దారితీస్తోంది.

### - గులాబీ శ్రేణులకు అసలు పరీక్ష ఇక్కడే

నాయకుల మధ్య విభేదాలు, కార్యకర్తల మధ్య అయోమయమైతే ఒక రాజకీయ పార్టీలో నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండటం సాధారణమే. కానీ అవే విభేదాలు పార్టీ కార్యక్రమాల నిర్వహణలో, నాయకత్వ నిర్ణయాల్లో, కార్యకర్తల సమన్వయంలో బయటపడితే దాని ప్రభావం సంస్థాగతంగా కనిపించే అవకాశం ఉంటుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం వినిపిస్తున్న చర్చ కూడా ఇదే. ఎవరి కార్యక్రమానికి వెళ్లాలి? ఎవరి ఆదేశాన్ని అనుసరించాలి? నియోజకవర్గంలో పార్టీ తరపున తుది నిర్ణయం ఎవరిది అనే ప్రశ్నలు కేడర్‌లో తలెత్తుతున్నాయన్నది ఇటీవల వచ్చిన కథనాల ప్రధాన అంశం. అయితే ఈ ప్రశ్నలకు పార్టీ రాష్ట్ర నాయకత్వం లేదా సంబంధిత నియోజకవర్గాల అధికారిక నాయకత్వం నుంచి స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది.

### అయిదు నియోజకవర్గాలు, ఒకే సమస్య

ఖమ్మం లో నాలుగు వర్గాల చర్చ, పాలేరు లో మూడు వర్గాల చర్చ, వైరాలో మూడు వర్గాల చర్చ, అశ్వారావుపేటలో నాయకత్వ పోటీ, ఇల్లందు లో పాత అసమ్మతి నెలకొంది. వైరాలో మనీషా, చంద్రావతి, గిరిబాబు వర్గాలుగా రాజకీయ కథనాలు పేర్కొంటుండగా అశ్వారావుపేటలో తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు అనుచర వర్గాల మధ్య ఆధిపత్య పోరుపై వరుస కథనాలు వెలువడ్డాయి. ఇల్లందులో హరిప్రియ నాయక్ నాయకత్వంపై గతంలో వచ్చిన అసమ్మతి, పార్టీ పదవుల నియామకంపై తలెత్తిన విభేదాలు రాజకీయ చరిత్రలో నమోదయ్యాయి. ఈ అయిదు ప్రాంతాలను కలిపి చూస్తే ఒక ప్రశ్న మాత్రం ముందుకు వస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్‌కు ఇప్పుడు ప్రధాన సవాలు ప్రత్యర్థి పార్టీనా లేక ముందుగా అంతర్గత సమన్వయాన్ని పునర్నిర్మించుకోవడమా ఈ ప్రశ్నకు సమాధానం పార్టీ తీసుకునే తదుపరి నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

### - అధిష్ఠానం ఏం చేస్తుంది

వర్గాలను కలుపుతుందా లేక కొత్త నాయకత్వ సమీకరణాలకు తెరతీస్తుందా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలంటే స్థానిక నాయకత్వాల మధ్య సమన్వయం కీలకంగా మారింది. ముఖ్యంగా నియోజకవర్గాల వారీగా స్పష్టమైన బాధ్యతలు, పార్టీ కార్యక్రమాలపై ఏకాభిప్రాయం, స్థానిక నాయకుల మధ్య సమన్వయ సమావేశాలు, కార్యకర్తలకు స్పష్టమైన దిశానిర్దేశం వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇటీవల వెలువడిన కథనాల్లో కనిపిస్తున్న విభేదాలు పార్టీ అధికారికంగా ధృవీకరించిన అంతర్గత సంక్షోభంగా భావించడానికి ఇంకా మరింత ప్రత్యక్ష ఆధారం అవసరం. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. నాయకుల మధ్య వచ్చే ప్రతి విభేదం ఇప్పుడు బహిరంగ రాజకీయ చర్చగా మారుతోంది. ఇలా వర్గవిభేధాలు ఉంటే ఆ పార్టీ మనుగడ పెద్ద ప్రమాదంలో పడే పరిస్థితి కనిపిస్తుంది. ఇప్పటికైనా ఆ పార్టీ అధిష్టానం నాయకత్వాన్ని సమన్వయం చేయకపోతే ఆ పార్టీకి మనుగడ దెబ్బ తిని ఉనికిని కోల్పోయే ప్రమాదం లేకపోలేదు మరి.

## పీఎం సూర్య ఘర్ పథకం కింద జిల్లాలో మోడల్ సోలార్ విలేజ్ కాంపిటీషన్‌కు 5 గ్రామాలు ఎంపిక

**రూ.1 కోటి గ్రాంట్ సాధించే అవకాశం**

**పెద్ద ఎత్తున సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 28 నేటి శుభోదయ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పీఎం సూర్య ఘర్ పథకం" ద్వారా ప్రతి జిల్లాలో 5,000 కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాలను 'మోడల్ సోలార్ విలేజ్'గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం ఏపీఎస్పీడీసీఎల్ ఎస్.ఈ, జెడ్పీ సీఈఓ, డీఆర్డీఏ పిడి, నెడ్క్యాప్ అధికారులు, ఎల్డీఎం, డిపిఓలతో మోడల్ సోలార్ విలేజ్ లలో పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం కింద జిల్లాలో మోడల్ సోలార్ విలేజ్ కాంపిటీషన్‌కు జిల్లా పరిధిలోని 5 గ్రామాలు నార్పల, యాడికి, కంబదూరు, రాప్తాడు, ఉరవకొండ గ్రామాలను ఈ పోటీ కోసం ఎంపిక చేశారన్నారు.

ఈ రోజు నుండి రాబోయే 3 నెలల పాటు ఈ ఐదు గ్రామాల మధ్య 'సోలార్ కాంపిటీషన్' నిర్వహించబడుతుందని, పోటీ వ్యవధిలో పీఎం సూర్య ఘర్ పథకం కింద ఏ గ్రామంలో అయితే అత్యధికంగా సోలార్ రూఫ్‌టాప్ ఇన్స్టాలేషన్లు ఏర్పాటు చేసుకుంటారో, ఆ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం రూ. 1 కోటి రూపాయిల ప్రోత్సాహక నిధులను మంజూరు చేస్తుందన్నారు.

ఈ గ్రామాలలో రాబోయే 3 నెలల పాటు ఎవరు ఎక్కువ చేస్తారో నివేదిక తెప్పించుకోవాలని, నివేదిక ఆధారంగా ఎంఎన్ఆర్ఈ (మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెనేవబుల్ ఎనర్జీ) ద్వారా 1 కోటి రూపాయల ప్రోత్సాహకం అందిస్తుందన్నారు.

ఎంపికైన గ్రామం బిల్లులను దశలవారీగా అప్‌లోడ్ చేయడం ద్వారా ఈ నిధులు విడుదలవుతాయన్నారు. ఈ గ్రాంట్ మొత్తాన్ని గ్రామంలోని ఇతర మౌలిక వసతులు అభివృద్ధి పనుల కోసం ఉపయోగించుకోవచ్చన్నారు.

ఈ పథకం ద్వారా ఇళ్లకు ఉచిత విద్యుత్ అందడంతో పాటు గ్రామానికి రూ. 1 కోటి అభివృద్ధి నిధులు వచ్చే అవకాశం ఉన్నందున, ఎంపిక చేసిన ఐదు గ్రామాల (నార్పల, యాడికి, కంబదూరు, రాప్తాడు, ఉరవకొండ) ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి పెద్ద ఎత్తున సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డిఆర్డిఏ పిడి శైలజ, నెడ్ క్యాప్ మేనేజర్ కిషోర్, ఎల్డిఎం మారుతి శ్రీనివాసులు, డిపిఓ నాగరాజునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగులపై లాఠీ చార్జ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**వాలంటీర్లకు నెలకు 10 వేలు**

**ఇస్తామనిచెప్పి ఆ వ్యవస్థను పూర్తిగా రద్దు చేశారు**

**రెండున్నర ఏళ్ళు పూర్తి అయిన నిరుద్యోగులకు**

**నిరుద్యోగ భృతి ఇవ్వలేదు**

**చెప్పిన హామీలను తుంగ లోకి తొక్కారు**

**వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి**

**ప్రభుత్వంపై ధ్వజం**




అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 28 నేటి శుభోదయ : తమ సమస్యలు పరిష్కరించాలని విజయవాడలో శాంతియుత నిరసన తెలియజేసిన సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వ దమనకాండను అనంత వెంకటరామిరెడ్డి ఖండించారు.అనంతపురం కార్పొరేషన్ పరిధిలో డివిజన్ల విభజన..ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళల గుర్తింపు తీరు అసంబద్ధంగా జరిగిందని అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు.ప్రభుత్వ ఖజానాను టీడీపీ కార్యకర్తలకు కట్టబెట్టేందుకే ప్రభుత్వం ఇన్‌ఫ్లుయెన్సర్ పాలసీ తీసుకొచ్చిందని మండిపడ్డారు.అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ....ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చాలన్న సమున్నత లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.35 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించడంతో పాటు వారికి సహాయకులుగా వాలంటీర్లను నియమించి ఐదేళ్ల పాటు ప్రజల వద్దకు పరిపాలన తీసుకెళ్లారు. గత ఎన్నికల ముందు వాలంటీర్లకు రూ.10 వేలు జీతం ఇస్తామంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి రాగానే వాలంటీర్లను తొలగించారు. రెండున్నరేళ్లుగా సచివాలయ ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. అదనపు పనిభారం మోపి మానసికంగా ఇబ్బంది పెడుతున్నారు.తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో పెద్ద ఎత్తున సచివాలయ ఉద్యోగులు శాంతియుత నిరసనకు పిలుపునిస్తే అన్ని జిల్లాల్లోనూ ఉన్నతాధికారులు బెదిరించారు. అధికారుల బెదిరింపులను సైతం ఖాతరు చేయకుండా సచివాలయ ఉద్యోగులు కదం తొక్కారు. నోషనల్ ఇంక్రిమెంట్లను మంజూరు చేసి తమను జూనియర్ అసిస్టెంట్ కేడర్‌గా గుర్తించాలని కోరడం సచివాలయ ఉద్యోగులు చేసిన తప్పా?సచివాలయ ఉద్యోగులకు నిర్దిష్టమైన ప్రమోషన్ విధానంతో పాటు జీవో నంబర్ 11ను రద్దు చేయాలి. జీవో నంబర్ 5 పై పునఃసమీక్ష చేయాలి. ప్రశాంతంగా నిరసన తెలుపున్న ఉద్యోగులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం ఏంటి? మహిళా ఉద్యోగులని కూడా చూడకుండా స్టేషన్లలో నిర్బంధిస్తారాఉద్యోగులతో ప్రభుత్వం వ్యవహరించిన తీరును వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలోనే బషీర్‌బాగ్‌లో విద్యుత్ చార్జీల ఉద్యమంపై ఉక్కుపాదం మోపారు. గుర్రాలతో తొక్కించి కాల్పులు జరిపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలియజేస్తే పాశవికంగా వ్యవహరిస్తారా?వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఉద్యోగులకు మేం అండగా నిలిచాం. అధికారంలోకి రాగానే ఐఆర్ ప్రకటించారు. ఎప్పటికప్పుడు డీఏలు ఇచ్చాం. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేశాం. ఎన్నికల ముందు ఉద్యోగులకు హామీలు ఇచ్చిన చంద్రబాబు ఈ రెండున్నరేళ్లుగా వాళ్లకు చేసిందేమీ లేదు. డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను కూడా నియమించలేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ నెరవేర్చలేదు.లిప్రశ్నిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలపై కూడా కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. విజయవాడలో సచివాలయ ఉద్యోగులపై లాఠీచార్జ్ చేసిన వాళ్లపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలి. స్థానిక ఎన్నికలు వస్తున్నాయనే కొత్త పింఛన్లు అంటూ చంద్రబాబు డ్రామాకు తెరలేపారు.రెండున్నరేళ్లయినా నిరుద్యోగ భృతి ఇవ్వలేదు.. ఆడబిడ్డ నిధి అందించలేదు. డీఎస్సీ నియామకాలకు సంబంధించి స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు బయటపడితే టీడీపీకి చెందిన వాళ్లను ఉసిగొల్పి దాడులకు పాల్పడుతున్నారు. అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్‌లో డివిజన్ల విభజనతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సంబంధించి గుర్తింపు ప్రక్రియ అసంబద్ధంగా జరిగింది.50 డివిజన్లను 62 డివిజన్లుగా మారిస్తే జనాభాకు అనుగుణంగా డివిజన్ల విభజన చేయాలి. కానీ క్షేత్రస్థాయిలో అలా జరగలేదు. డివిజన్ల విభజన పరిపాలన పరంగా ఉంటుందని అందరూ భావించారు. కానీ అధికార పార్టీ నేతలు తమకు అనుకూలంగా చేసుకున్నారు. కొన్ని డివిజన్లలో 2 వేల ఓట్లు ఉంటే కొన్ని డివిజన్లలో 5 వేలు ఉండడం ఏంటి

### -అధికార పార్టీకి కావాల్సినట్లు..

నాయకులకు అనుకూలంగా ఉండేలా డివిజన్లు విభజిస్తారా బీసీలు లేని చోట బీసీలు ఎక్కువగా ఉన్నారని.. బీసీలు ఉన్న చోట్ల తక్కువగా ఉన్నారని జాబితా రూపొందిస్తే ఎలా జిల్లా ఎన్నికల అధికారి, అనంతపురం కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకుని డివిజన్ల విభజన, కులాల గుర్తింపు నిష్పక్షపాతంగా ఉండేలా చూడాలి. మరోసారి క్రాస్ చెక్ చేయండి.తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ప్రభుత్వ ఖజానాను దోచిపెట్టడం కోసమే ఇన్‌ఫ్లుయెన్సర్ పాలసీ తెచ్చారు.చంద్రబాబు ఇచ్చిన హామీలను, ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడితే ఇదే ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టింది. కానీ ఈ రోజు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసుకోవడం కోసం ప్రయత్నిస్తోంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొంటాం. కూటమి పార్టీలకు వ్యతిరేకంగా ప్రజాతీర్పు ఉంటుంది.

## 'పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- సేవా సంకల్పం అభియాన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన రామసేన అధ్యక్షుడు :'కంబాల'..**



కోరుకొండ, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);సేవా సంకల్పం అభియాన్ కార్యక్రమంలో భాగంగా విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాసరావు పార్టీ శ్రేణులతో కలిసి గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ లే అవుట్ వద్ద, రహదారి ఇరువైపుల మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. నేటి సమాజంలో పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో మొక్కల పెంపకం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పచ్చదనం పెరిగితే పర్యావరణ సమతుల్యతతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని తెలిపారు. సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సమాజహితం, పర్యావరణ పరిరక్షణకు పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని కంబాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## షహీద్ సర్దార్ భగత్ సింగ్ 119వ జయంతి ఘనంగా నిర్వహణ




యాడికి సెప్టెంబర్ 28 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : పట్టణంలోని విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో షహీద్ సర్దార్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో విద్యార్థుల సమక్షంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పాఠశాల కరస్పాండెంట్ విశ్వనాథ్ మాట్లాడుతూ, భగత్ సింగ్ కేవలం 23 సంవత్సరాల వయస్సులోనే దేశ స్వాతంత్ర్య సంగ్రామం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడని కొనియాడారు. కేవలం 13 ఏళ్ల ప్రాయంలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని దేశభక్తిని చాటుకున్నారని, చివరి శ్వాస వరకు "ఇంక్విలాబ్ జిందాబాద్" అంటూ ఆయన చేసిన త్యాగం యువ భారతాన్ని ఎప్పటికీ మేల్కొలుపుతూనే ఉంటుందని తెలిపారు. భగత్ సింగ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత అన్ని రంగాల్లో ధైర్యంగా రాణించి నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం

కాకినాడ జిల్లా, జగ్గంపేట సెప్టెంబర్ 28 నేటి శుభోదయ : గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలోని నిలకుండిలాపేట రామాలయం వీధిలో బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా బాల గణేష్ యూత్ సభ్యులు శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తులు, గ్రామస్థులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం నిర్వహణలో బాల గణేష్ యూత్ సభ్యుల సేవలను పలువురు అభినందించారు.

## "పిజిఆర్ఎస్ లో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు"




తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 28 (నేటి–శుభోదయ) తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో ఈరోజు సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యేసుబాబు ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, ఆస్తి పన్ను, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. కొన్ని ఫిర్యాదులపై వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించి, ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు నేరుగా అందేలా చూడాలి అని కమిషనర్ అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డి. భవాని బాబు మరియు మున్సిపల్ అధికారులు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## అక్టోబర్ రెండున టియుడబ్ల్యూజె (ఐజెయు) ఆందోళన

ఖమ్మం, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ::: జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, సంక్షేమ పథకాల సాధన కోసం గాంధీ జయంతి రోజున జిల్లా పరిషత్ కార్యాలయం –ఎదుట శాంతియుత ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు –వెంకటేశ్వరరావు, మైసా పాపారావు లు తెలిపారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పట్ల ప్రభుత్వం నాన్చివేత ధోరణిని అవలంభిస్తుందని –మండల, జిల్లా కేంద్రాల్లో ఇండ్ల స్థలాల కేటాయింపు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టినట్లు వారు తెలిపారు. న్యాయస్థానాల పేరుతో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డును ఇవ్వాలని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టియుడబ్ల్యూజె (ఐజెయు) డిమాండ్ చేస్తుందని వారు తెలిపారు. రోజు రోజుకు జర్నలిస్టుల హక్కులు హరించబడుతున్నాయని వారు ఆరోపించారు. జర్నలిస్టుల సంక్షేమం మండల కేంద్రాలు సహా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇండ్ల స్థలాల పంపిణీ, హెల్త్ కార్డులు ఇతర –జర్నలిస్టుల సమస్యలపై జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని వెంకటేశ్వరరావు, పాపారావు లు విజ్ఞప్తి చేశారు.

## రైలు రూపంలో కాళ్లు కరిగినా.. చెక్కుచెదరని ఆత్మస్థైర్యం

**ఎమ్మెల్యే జెసి అష్మిత్ రెడ్డి చొరవతో దివ్యాంగుడు కు మోటరైజ్డ్ బ్యాటరీ సైకిల్ అందజేత!**

**యాడికి సెప్టెంబర్ 28 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :**



"నా జీవితం ఇక ఇంతే అనుకున్నాను... రైలు రూపంలో వచ్చిన ప్రమాదం నా రెండు కాళ్లను బలి తీసుకోవడంతో పాటు, నా రెక్కల కష్టాన్ని కూడా లాగేసుకుంది. కాలు కదిపే పరిస్థితి లేదు, ఎవరి మీదో ఆధారపడి బతకాల్సిన దుస్థితి. కుటుంబ పోషణ భారమై, పూట గడవడం కష్టమైన తరుణంలో, నా కష్టాన్ని చూసి చలించిన 'మే ఐ హెల్ప్ యు' ఫౌండేషన్ సభ్యులు నాకు దేవుడిలా కనిపించారు" అంటూ యాడికి మండల కేంద్రంలోని నారాయణస్వామి కాలనీకి చెందిన బాధితుడు సుంకన్న తన ఆవేదనను, ఆనందాన్ని కంటతడి పెట్టుకుంటూ పంచుకున్నారు. యాడికి మండల కేంద్రంలోని నారాయణస్వామి కాలనీలో నివాసం ఉంటున్న సుంకన్న ఏడాది కిందట జరిగిన దురదృష్టకరమైన రైలు ప్రమాదంలో తన రెండు కాళ్లను పూర్తిగా కోల్పోయారు. నిత్యం కష్టపడి బతికే ఆ కుటుంబానికి ఈ ప్రమాదం కోలుకోలేని దెబ్బయింది. కాలు కదిపే అవకాశం లేక, నూటికి నూరుపాళ్లు ఇతరులపై ఆధారపడాల్సిన దీనస్థితిలో సుంకన్న కుటుంబం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ కష్టకాలంలో ఎటూపాలుపోని స్థితిలో ఉన్న ఆయన, ఎలాగైనా తన కాళ్లపై తాను కొద్దిగానైనా తిరిగేందుకు ఒక బ్యాటరీ సైకిల్ ఇప్పించాలని 'యాడికి మే ఐ హెల్ప్ యు' ఫౌండేషన్ సభ్యులను అభ్యర్థించారు. బాధితుడి దీనస్థితిని అర్థం చేసుకున్న ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించారు. సుంకన్న పరిస్థితిని వివరిస్తూ వాట్సాప్ గ్రూపుల ద్వారా దాతల సహాయాన్ని అర్థించారు. ఈ సమాచారం స్థానిక విజన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ విశ్వనాథ్ దృష్టికి వెళ్లడంతో, ఆయన వెంటనే స్పందించి తాడిపత్రి శాసనసభ్యులు జెసి అష్మిత్ రెడ్డికి ఈ విషయాన్ని చేరవేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జెసి అష్మిత్ రెడ్డి ఏమాత్రం ఆలస్యం చేయకుండా, బాధితుడి కష్టాన్ని స్వయంగా స్పందించి బ్యాటరీ సైకిల్ కొనుగోలుకు అవసరమైన పూర్తి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే నుండి ఆర్థిక సహాయం అందిన వెంటనే ఫౌండేషన్ సభ్యులు హుటాహుటిన స్పందించి సరికొత్త బ్యాటరీ సైకిల్ ను కొనుగోలు చేసి సుంకన్నకు అందజేశారు. తన కష్టాన్ని గుర్తించి క్షణాల వ్యవధిలో స్పందించి అండగా నిలిచిన తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డికి, వాట్సాప్ గ్రూపుల ద్వారా తన గోడును నలుగురికి చేరవేసి సహాయం అందించడంలో కీలక పాత్ర పోషించిన 'మే ఐ హెల్ప్ యు' ఫౌండేషన్ సభ్యులకు, దాతలకు సుంకన్న ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలిపారు. ఈ బ్యాటరీ సైకిల్ తన జీవితంలో కొత్త వెలుగును నింపిందని, తన కష్టాలను కొంతవరకు తీర్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు బండారు బాలకృష్ణ, ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి, పర్లపాటి మహేంద్ర యాదవ్, కాయపాటి నరేష్ యాదవ్, టీడీపీ బీసీ సెల్ ప్రెసిడెంట్ తిరంపురం నీలకంఠ, మైనార్టీ అధ్యక్షుడు మునిమడుగు సుభహాన్, బోయ పాండు, మేకల రామాంజి, రాజు, ఎరుకల నారాయణ, లక్ష్మయ్య, తిరుమలేష్ శివకోటి, రాజబాబు, ఫైబర్ చందు, యువరాజ్, వెంకటాద్రి, కుమార స్వామి, గిల్లి, పల్లా శివశంకర్, నారాయణస్వామి పాల్గొన్నారు

## "ప్రధాని నరేంద్ర మోడీ దేశారక్షణలో రాజీ లేదు శత్రుదేశాలు భారత్ వైపు కన్నెత్తి చూడటానికి భయపడే పరిస్థితి కల్పించిన మోడీ దేశ సమగ్రాభివృద్ధికి నిరంతర కృషి రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బొలిశెట్టి"



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 28 (నేటి- శుభోదయ) శత్రు దేశాలు భారత వైపు కన్నీటి చూసే సాహసం చేయలేని విధంగా రక్షణ రంగాన్ని పటిష్టం చేసిన దమ్మున్న నేత ప్రధాని నరేంద్ర మోడీ అని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. నరేంద్ర మోడీ పరిపాలన సేవా రజితోత్సవాల సందర్భంగా సేవా సంకల్పన భాగంగా భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి ప్రారంభించారు. కార్యక్రమానికి బిజెపి తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్షులు దువ్వ శ్రీను అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అనేకమంది ప్రధాన మంత్రులను చూసామని కానీ నరేంద్ర మోడీ పరిపాలనలో శత్రుదేశాలు పాకిస్తాన్ చైనా బంగ్లాదేశ్ గీత దాటి వచ్చే సాహసం చేయలేని పరిస్థితిని నరేంద్ర మోడీ కల్పించారని ఆయన ప్రశ్నించారు. రక్షణ రంగాన్ని అత్యంత ప్రతిష్టంగా తీర్చిదిద్ది దేశాన్ని సమగ్రంగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో వివరణ రాజకీయ పక్షాలు ఉండాలి తప్ప ప్రధానికి సహకరించాలని కోరారు. బంగ్లాదేశ్ రోహింగ్యాలు అక్రమంగా చొరబడి దశాబ్దాలుగా ఇక్కడ నివసిస్తూ దేశంలో సంపాదనకు అల్లగోడుతున్న అక్రమ వలసదారులను నరేంద్ర మోడీ బయటికి పంపించారన్నారు. కాంగ్రెస్ జనతా పార్టీ వంటి పార్టీలు వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రధాని నరేంద్ర మోడీ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని, దేశాన్ని మరింత అభివృద్ధిచే చేయాలని ఆకాంక్షించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈతకోట భీమ శంకరరావు (తాతాజీ ) మాట్లాడుతూనరేంద్ర మోడీ 25 ఏళ్ల పరిపాలన కాలంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి అభివృద్ధికి బాటలు వేశారని కొనియాడారు. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ వెనకబడిందని దీనికి ప్రధాన నరేంద్ర మోడీ చేయూతనిచ్చి ముందుకు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. నరేంద్ర మోడీ సమర్థ పరిపాలన సేవా రైతా ఉత్సవాలు సేవా సంకల్పం కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. నెల రోజులు పాటు పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రక్తదానానికి ముందుకు వచ్చిన వివిధ కళాశాల విద్యార్థులు యువతకు ఆయన అభినందనలు తెలియజేశారు. బిజెపి యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింధు పైడికొండల మాట్లాడుతూ నరేంద్ర మోడీ 25 సంవత్సరాల పాటు సమర్థ పరిపాలన అందిస్తూ ప్రజల సేవకు అంకితమయ్యారని కొనియాడారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నెలరోజులపాటు సేవా సంకల్ప పేరిట వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. బి జె పి యువమోర్చా ఆధ్వర్యంలో జరుగుతున్న రక్తదాన శిబిరంలో విద్యార్థులు యువత ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రక్తదాన శిభిరాన్ని ప్రారంభించడం మరింత ప్రోత్సాహన్నిస్తోందని అన్నారు. రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశం మాట్లాడుతూ నరేంద్ర మోడీ సమర్థ పాలనలో దేశం అభివృద్ధి పదంలో నడుస్తోంది అన్నారు. ఆయన ఆయురారోగ్యాలతోదేశానికీ మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వం దేశానికి శ్రీరామరక్షాన్ని పేర్కొన్నారు. ఆయన పరిపాలనలో అన్ని రంగాలు విశేష అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు,కార్యదర్శి కసిరెడ్డి నాగదుర్గ,జిల్లా కార్యవర్గ సభ్యులు రామగాని సత్యనారాయణ, సామినేని రంగారావు,మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సన్నిధి లక్ష్మి దుర్గా,తెలుగుదేశం నాయకులు సుబ్బరాజు, మద్దిపాటి ధర్మేంద్ర, బేతు గిరిధర్,జనసేన నాయకులు మద్దాల మాణికుమార్, చాపల రమేష్,బిజెపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు ఎమ్మెల్యే బొలిశెట్టి, తాతాజీ, సింధు సర్టిఫికెట్ లు అందజేశారు.

## కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్వహణ అస్తవ్యస్తం

**– ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు, రోగులు**



ఖమ్మం, కల్లూరు, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ::: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించి ప్రజల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ఏర్పాటు కల్లూరులో కోట్లాది రూపాయలతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మించి ప్రజలకు అందుబాటులో తెచ్చారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారి ఎవరిష్టం వారిదిగా వ్యవహరిస్తూ పేదలకు వైద్య సేవలు అందించడంలో పూర్తిగా విఫలం అవుతుంది. సుమారు రూ 10.50 కోట్ల రూపాయలతో అధునాతనమైన బిల్డింగులు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగింది. వైద్యుల్ని పూర్తిస్థాయిలో నియమించటం కోసం ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కల్లూరులో సిహెచ్ సి ఏర్పాటు చేసిన దగ్గర నుండి నిర్వహణకు పూర్తిస్థాయిలో విధులు నిర్వహించేందుకు సూపర్డెంట్ ను నియమించకపోవడం ప్రజలకు శాపంగా మారింది. డిప్యూటేషన్ పై సూపర్డెంట్ నియమించటం తో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వైద్యులు విధులకు అప్పుడప్పుడు వస్తు ఒకటి రెండు గంటలు పని చేస్తూ వెళు తూ ఉంటే కింది సిబ్బంది అదే అలుసుగా తీసుకొని వారు అదే రీతిలో నడుస్తుండటంతో ప్రజలకు వైద్యం ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం సూపర్డెంట్ గా పనిచేస్తున్న వైద్యాధికారి ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణాజిల్లా తిరువూరులో ప్రైవేట్ హాస్పటల్ నిర్వహిస్తూ అక్కడే ఎక్కువ సమయం కేటాయిస్తూ ఎప్పుడో ఒకసారి కల్లూరు లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కువచ్చి అలా విజిట్ చేసి వెళ్ళిపోతుంటారు. ఆస్పత్రికి ఎవరు వెళ్ళిన సూపర్డెంట్ ఎక్కడ అంటే ఇప్పుడే బయటికి వెళ్లారు వస్తారు అనే సమాధానం చెబుతారు. అసలు ఆయన ఎప్పుడు వస్తారు ఎవరికి తెలియదు . రోగులు వచ్చి ఓపి రాయించుకొని వైద్యుల కోసం ఎదురుచూపే ప్రతిరోజు జరిగే నిత్య సత్యం .పర్మినెంట్గా సూపర్నెంట్ ను నియమిస్తే అతనికి పూర్తిస్థాయి బాధ్యత ఉంటుంది. డిప్యూటేషన్ పై వచ్చిన వారు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో ఇదేమిటని ప్రశ్నిస్తే ఇది నా డ్యూటీ కాదు ఏదో డిప్యూటేషన్ మీద వచ్చాను, వద్దంటే వెళ్ళిపోతాను అంటూ ప్రశ్నించిన వారిని బెదిరించటం పరిపాటిగా మారింది.

### ఆసుపత్రిలో పూర్తిస్థాయి డాక్టర్ పోస్టులు భర్తీ చేయాలి

సిహెచ్ సి హాస్పిటల్ లో వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 14 మంది డాక్టర్లు ఉండాలి. ప్రస్తుతం ఐదుగురు డాక్టర్లు పనిచేస్తున్నారు. ఇద్దరు పర్మనెంట్ డాక్టర్లు. మత్తు డాక్టర్ అశోక్, జనరల్ మెడిసిన్ రంజిత్ లు, డిప్యూటేషన్ పై డాక్టర్లు ముగ్గురు ఒకరు సూపర్డెంట్, బానోత్ రమేష్, ఈ ఎన్ టి డాక్టర్ రవికుమార్ , ఎంఎస్ జనరల్ సర్జన్ డాక్టర్, మహిళా డాక్టర్ నికిత . ఉన్నారు. భర్తీ చేయాల్సిన డాక్టర్ పోస్టు పిల్లల వైద్యులు, స్త్రీల వైద్యులు, డెంటల్, ఆర్థోపెడిక్, నేత్ర వైద్య నిపుణులు, న్యూరాలజిస్ట్, చేస్ట్ ఫిజీషియన్, జనరల్, మెడిసిన్, యూరాలజిస్ట్, తదితర పోస్టులకు వైద్యులను నియమించాల్సి ఉంది. అదేవిధంగా ఎక్సరే, ఈసీజీ, ల్యాబ్ నిర్వహణకు సంబంధించి సిబ్బందిని నియమించాలి. ప్రస్తుతం ప్రభుత్వ పరంగా 14 మంది నర్సులు, ఇద్దరు ఏఎన్ఎంలు, ఒక ఎఫ్ ఎన్ ఓ విధులు నిర్వహిస్తున్నారు. అవుట్సోర్సింగ్ లో 17 మంది సిబ్బంది ఉన్నారు. ఇంకా 15 మందికి పైగా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం పేషంట్ కేర్లుగా ఐదుగురు, సెక్యూరిటీ విభాగంలో నలుగురు, శానిటేషన్ స్వీపర్లుగా ఏడుగురు, సూపర్వైజర్ గా ఒకరు పని చేస్తున్నారు. ఆస్పత్రి నిర్వహణ సక్రమంగా నిర్వహించకపోవటం, సిబ్బంది పట్ల సమన్వయం లేకపోవడంతో పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత ఆసుపత్రిలో అస్తవ్యస్తంగా తయారయింది. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి ఉంది. బాత్రూమ్స్ వాటర్ సప్లై సక్రమంగా లేదు.. పైపుల లీకేజీలు, ఉన్నాయి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం బ్లీచింగ్ చల్లకపోవడం వాటర్ ట్యాంకులు క్లీనింగ్ లేకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. కొంతమంది శానిటేషన్ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని చర్చించుకుంటున్నారు. అర్హత లేని ఒక శానిటేషన్ మహిళను సెక్యూరిటీ గార్డుగా నియమించారని. ఆమె డ్యూటీ సక్రమంగా చేయట్లేదంటూ ఆరోపణలు ఉన్నాయి.. అవుట్సోర్సింగ్ కాంట్రాక్టర్ తో సూపర్వైజర్ గా పనిచేస్తున్న వ్యక్తి మిగతా సిబ్బందికి సంబంధించి లేనిపోని ఫిర్యాదులు చేస్తూ సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రిలో పర్మినెంట్ సూపర్డెంట్ నియమించాలి

పేద ప్రజలకుసక్రమంగా వైద్యం అందాలంటే ఆసుపత్రిలో పర్మినెంట్ సూపర్డెంట్ నియమించడంతోపాటు పర్యవేక్షణ కూడా సక్రమంగా చేస్తేనే పేద ప్రజలకు సరైన వైద్యం అందుతుందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజాప్రతినిధులు ఆసుపత్రి నిర్వహణపై పర్యవేక్షణ పెంచితేనే ఆసుపత్రిలో పరిశుభ్రతతో పాటు పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందని అందుకు జిల్లా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

## పాలెపు ఆధ్వర్యంలో 44 వ డివిజన్ లో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ





ఖమ్మం, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ::: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డైనమిక్ కాంగ్రెస్ యూత్ లీడర్ తుమ్మల యుగంధర్ సహకారంతో సోమవారం 44 వ డివిజన్ మాజీ తాజా కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ చొరవతో రూ 32000 వేల రూపాయల విలువైన చెక్కును లబ్ధిదారుడికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలు మాట్లాడుతూ 44 వ డివిజన్ ప్రజలకు సంక్షేమ ధ్యేయంగా డివిజన్ మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ, పాలెపు వెంకటరమణ ఆధ్వర్యంలో నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు భరోసా కల్పించేలా ఆయన నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నారని డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుడివాడ జెండాల చౌక్ వద్ద ఘనంగా గ్యార్మి షరీఫ్ వేడుకలు

**–పాల్గొన్న మాజీ మంత్రి కొడాలి నాని, వైసీపీ నాయకులు**

**–మాబూ సుభాని దీవెనలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి: కొడాలి నాని**



గుడివాడ, సెప్టెంబర్ 28 నేటి శుభోదయ: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీనివాస సెంటర్ జెండాల చౌక్ వద్ద జష్నే మిలాదే గౌసుల్ వరా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గ్యార్మి షరీఫ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మాజీ మంత్రి కొడాలి నాని, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు. వేడుకలకు హాజరైన మాజీ మంత్రి కొడాలి నాని, వైసీపీ నాయకులకు వైసీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ ఖాసిం (అబూ), కమిటీ సభ్యులు సంప్రదాయ పద్ధతిలో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం మహబూబ్ సుభాని జెండాల దర్గాలో కొడాలి నాని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మైనార్టీ పెద్దలతో కలిసి గ్యార్మి షరీఫ్ విందును కొడాలి నాని ప్రారంభించారు. ముస్లిం సోదరులతో కలిసి సామూహిక విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ.. గుడివాడలో అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, సోదరభావంతో పండుగలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మత సామరస్యాన్ని, ప్రజల మధ్య ఐక్యతను చాటిచెప్పేలా గ్యార్మి షరీఫ్ వేడుకలను నిర్వహిస్తున్న జష్నే మిలాదే గౌసుల్ వరా కమిటీ సభ్యులను అభినందించారు. మతాలు వేరైనా మానవత్వం ఒక్కటేనని, ప్రజలంతా సుఖశాంతులతో, సౌభాగ్యం తో జీవించాలన్నదే ప్రతి ఒక్కరి ఆకాంక్ష అని కొడాలి నాని పేర్కొన్నారు. మహబూబ్ సుభాని దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మైనారిటీ సెల్ అధ్యక్షుడు అబూ మాట్లాడుతూ మతాల నేడు విందులో పాల్గొని విజయవంతం చేసిన వారికి ధన్యవాదాలు చెప్పారు. తన తండ్రి స్వర్గీయ మహమ్మద్ ఇక్బాల్ భాష నేతృత్వంలో గత 40 ఏళ్ల పాటు జెండాల చౌక్ లో కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను ఎంతో ఘనంగా జరిగాయని అబూ తెలిపారు. పెద్దల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక ఘనంగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్యార్మి షరీఫ్ వేడుకల్లో, వైసిపి రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, గుడివాడ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు అడబాల అప్పారావు, నందివాడ మండల వైసీపీ అధ్యక్షుడు పెయ్యాల ఆదాం, వైసిపి నాయకులు వేంపల అప్పారావు , వడ్లాని సుధాకర్, కందుల నాగరాజు, కమిటీ సభ్యులు మహమ్మద్ ఇమ్రాన్ బాషా, ముజీబ్, ఖలీక్, యూనస్, అజీమ్, అమీన్, బన్నీ, పలువురు మైనార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# మన గోదావరి-మన బాధ్యత

**- స్వచ్ఛతలో పాల్గొన్న డబ్ల్యూజేఐ పాత్రికేయులు**




కరీంనగర్, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ::: జీవనది గోదావరిని కాపాడుకోవడం, భవిష్యత్తు తరాలకు సుస్థిర పర్యావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ఎన్టీపీసీ రామగుండం ఆధ్వర్యంలో సోమవారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ పుష్కరఘాట్ గోదావరినది వద్ద చేపట్టిన క్లీన్లీనెస్ డ్రైవ్ గోదావరి రివర్ బ్యాంకు కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూజేఐ) సభ్యులు, అంతర్గాం, రామగుండం ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. నది తీరంలో చేపట్టిన స్వచ్ఛత పనుల్లో పాల్గొని చెత్త చెదారాన్ని తొలగించారు. తొలగించిన చెత్తను ట్రాక్టర్లలో వేసి దూరంగా పడవేయించారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ ఈ.డి. (ఆర్అండ్ టి) చందన్ కుమార్ సమంత ప్రెస్ క్లబ్ పాత్రికేయులను ప్రత్యేకంగా అభినందించారు. ఎన్టీపీసీ అధికారులు, ఉద్యోగులు, గోలివాడ, విలేజి అంతర్గాం గ్రామ ప్రజలతో కలిసి పాత్రికేయులు క్లీన్లీనెస్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం, రామగుండం ప్రెస్ క్లబ్ ల అధ్యక్షుడు పంజాల రాధాస్వామిగౌడ్, సభ్యులు కాంపెల్లి మల్లిఖార్జునస్వామి, దాసరి విష్ణుకుమార్, పల్లికొండ మధూకర్, తగురం కరుణాకర్, పూసాల రవి, తూండ్ల శ్రీనివాస్ పటేల్, నగునూరి రాజయ్య గౌడ్ లు పాల్గొన్నారు.

## పేద బ్రాహ్మణునికి ఫ్యామిలీ క్లబ్ ఆర్థిక సహకారం

**– 63వ మాసం సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహణ**

ఒంగోలు, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ::: ఫ్యామిలీ క్లబ్ సభ్యులు నిరంతరాయంగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల చేపట్టిన 63వ సేవా కార్యక్రమం విలువ రూ. లక్ష దాటిందని క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి. వీర రాఘవరావు తెలిపారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు బాధితులకు, విద్యార్థులకు ఆర్థిక, వస్తు రూపంలో సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా పి.వి. రాఘవరావు మాట్లాడుతూ.. పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతున్న ఒక పేద బ్రాహ్మణ కుటుంబానికి తమ 'శుభోదయం గ్రూప్' ద్వారా సేకరించిన ఆర్థిక సాయంతో పాటు, క్లబ్ సభ్యుడు తిరుమలరావు సమకూర్చిన రెండు నెలలకు సరిపడా మందులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలకు సాయం: రాయపూడిలోని గురుకుల పాఠశాల విద్యార్థుల భోజన వసతి కోసం నిత్యవసర సరుకులు మరియు నగదును అందజేశారు. గోదాన సమర్పణ: ప్రతి నెల ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లుగానే మడనూరులోని గోసంగమునకు గోదాన సమర్పణ చేశారు. గత పదేళ్ల క్రితం మిత్రులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న ఈ సామాజిక సంఘం ద్వారా గత 63 నెలలుగా క్రమం తప్పకుండా అవసరార్థులకు సేవలు అందిస్తున్నామని రాఘవరావు తెలిపారు. విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతి ఏటా నగదు బహుమతులు ప్రదానం చేస్తున్నామని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ క్లబ్ అధ్యక్షుడు, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు, లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు పొట్టి వీర రాఘవరావుతో పాటు ఫ్యామిలీ క్లబ్ డైరెక్టర్లు కే.వి. సురేష్, పి. విజయ్ కృష్ణ, కే. చంద్రమౌళి, బి.కె.వి. రమేష్, కోశాధికారి తాళ్లూరు శ్రీనివాసరావు, సభ్యులు నూకల వెంకటేశ్వర గుప్తా, తుమ్మపూడి సత్యనారాయణ, కే. రమేష్ బాబు, ఆడిటర్ ప్రతాప్, బైసాని శ్రీనివాసరావు, నల్లమల్లి రవి, పి. హరికృష్ణ, పి. గోపి (బ్యాంక్) తదితరులు పాల్గొన్నారు.

## పేద బ్రాహ్మణునికి ఫ్యామిలీ క్లబ్ ఆర్థిక సహకారం

**– 63వ మాసం సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహణ**




ఒంగోలు, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ::: ఫ్యామిలీ క్లబ్ సభ్యులు నిరంతరాయంగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల చేపట్టిన 63వ సేవా కార్యక్రమం విలువ రూ. లక్ష దాటిందని క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి. వీర రాఘవరావు తెలిపారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు బాధితులకు, విద్యార్థులకు ఆర్థిక, వస్తు రూపంలో సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా పి.వి. రాఘవరావు మాట్లాడుతూ.. పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతున్న ఒక పేద బ్రాహ్మణ కుటుంబానికి తమ 'శుభోదయం గ్రూప్' ద్వారా సేకరించిన ఆర్థిక సాయంతో పాటు, క్లబ్ సభ్యుడు తిరుమలరావు సమకూర్చిన రెండు నెలలకు సరిపడా మందులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలకు సాయం: రాయపూడిలోని గురుకుల పాఠశాల విద్యార్థుల భోజన వసతి కోసం నిత్యవసర సరుకులు మరియు నగదును అందజేశారు. గోదాన సమర్పణ: ప్రతి నెల ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లుగానే మడనూరులోని గోసంగమునకు గోదాన సమర్పణ చేశారు. గత పదేళ్ల క్రితం మిత్రులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న ఈ సామాజిక సంఘం ద్వారా గత 63 నెలలుగా క్రమం తప్పకుండా అవసరార్థులకు సేవలు అందిస్తున్నామని రాఘవరావు తెలిపారు. విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతి ఏటా నగదు బహుమతులు ప్రదానం చేస్తున్నామని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ క్లబ్ అధ్యక్షుడు, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు, లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు పొట్టి వీర రాఘవరావుతో పాటు ఫ్యామిలీ క్లబ్ డైరెక్టర్లు కే.వి. సురేష్, పి. విజయ్ కృష్ణ, కే. చంద్రమౌళి, బి.కె.వి. రమేష్, కోశాధికారి తాళ్లూరు శ్రీనివాసరావు, సభ్యులు నూకల వెంకటేశ్వర గుప్తా, తుమ్మపూడి సత్యనారాయణ, కే. రమేష్ బాబు, ఆడిటర్ ప్రతాప్, బైసాని శ్రీనివాసరావు, నల్లమల్లి రవి, పి. హరికృష్ణ, పి. గోపి (బ్యాంక్) తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న ప్రముఖులు



విజయవాడ, సెప్టెంబర్ 28 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రి పై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారి దర్శనానికి సోమవారం జిల్లా ఇంచార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్, జాయింట్ కలెక్టర్ శ్రీమతి ఇలక్కియ విచ్చేసారు. ఆలయం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ లు వారికి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాలు, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

## వంగూరు వెంకటేశ్వరరావు స్వర్ణ నంది అవార్డు



ఖమ్మం, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ::: ఖమ్మం చెందిన ఆకాంక్ష స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకులు వంగూరు వెంకటేశ్వరరావు స్వర్ణ నంది అవార్డును ప్రధానం చేశారు. ఆదివారం హైదరాబాదులో బిర్లా ఆడిటోరియం నందు మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారు వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి అవార్డులు అందించడం జరిగింది గత 2017 నుండి రక్తదానాలు ప్రమాదాలో చిక్కుకున్న వారిని ఎంతోమందిని కాపాడడం జరిగింది. అనాథ పిల్లలను సుమారు 20 మందిని చేరదీసి ఆశ్రయం కల్పించడం జరుగుతుంది ఇలా స్వచ్ఛంద సేవ చేస్తున్న వంగూరు వెంకటేశ్వర్లకు ప్రధాన్ రామకృష్ణ గౌడ్ ఫిలిం ఛాంబర్ నెంబర్, రత్న సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ రిటైర్డ్ గౌతమ్ రాజు శని సీనియర్ యాంకర్ డాక్టర్ శిరీష రెడ్డి చేతుల మీదగా స్వర్ణ నంది అవార్డు అందజేయడం జరిగింది. నంది అవార్డు వచ్చినందుకు డాక్టర్స్ రాజకీయ నాయకులు ప్రజలు ప్రశంసలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు రున్ వాల్ వీరన్న, కమిటీ సభ్యులు శ్రీను, కిరణ్, సుందర్ రావు, భార్గవ్, శైలజ, కళ్యాణి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల్లో అత్యంత పారదర్శకంగా వైదిక సిబ్బంది నియామకం

**కేవలం ప్రతిభ ఆధారంగానే ఎంపిక**

**– రాత, మౌఖిక పరీక్షల ద్వారా పోస్టుల భర్తీ:**

**దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ వెల్లడి.**



విజయవాడ, సెప్టెంబర్ 28 (నేటి శుభోదయ):-రాష్ట్రంలోని దేవాలయాల్లో జరిగే ప్రధాన పూజా కార్యక్రమాలు, వైదిక కైంకర్యాలు పూర్తి శాస్త్రోక్తంగా, సాంప్రదాయబద్ధంగా సాగేందుకు నిష్ణాతులైన అర్చకులను ఎంపిక చేసేలా ప్రభుత్వం అత్యంత పారదర్శక విధానాన్ని అమలు చేస్తోందని దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ స్పష్టం చేశారు. కేవలం ప్రతిభకే పెద్దపీట వేస్తూ రాత, మౌఖిక (ఇంటర్వ్యూ) పరీక్షల ద్వారా ఈ నియామకాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.సోమవారం మధ్యాహ్నం విజయవాడలోని సి.వి. రెడ్డి చారిటీస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతితో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 344 వైదిక సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని కమిషనర్ వివరించారు. ఈ నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.మొదటి విడత నియామకాల్లో భాగంగా 580 మంది వేదపండితులు దరఖాస్తు చేసుకోగా, అత్యంత ప్రతిభ కనబరిచిన 14 మంది వేద పండితులను పారదర్శకంగా ఎంపిక చేసి వివిధ దేవాలయాల్లో నియమించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రెండో దశలో అర్చక పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 107 అర్చక పోస్టులకు 816 దరఖాస్తులు అందగా, అర్హతలను పరిశీలించిన అనంతరం 441 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేసినట్లు చెప్పారు. ఇవాల్టి నుంచి ఆగమాల వారీగా రాత పరీక్షలు నిర్వహిస్తున్నామని, స్మార్తాగమం పరీక్షతో ఈ ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. తదుపరి రోజుల్లో పాంచరాత్ర, వైఖానస, శైవ, వీరశైవ, గ్రామ దేవత ఆగమాలకు సంబంధించి విడివిడిగా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షలను పారదర్శకముగా, పకడ్బందీగా నిర్వహించడం కోసం దేవదాయ శాఖ సీనియర్ అధికారులు, పర్యవేక్షకులు స్థాయి సిబ్బందితో ప్రత్యేకముగా ఒక కమిటీని నియమించినట్లు తెలిపారు. రాత పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థుల నుంచి 1:3 నిష్పత్తిలో మెరిట్ ఆధారంగా మౌఖిక పరీక్షకు ఎంపిక చేస్తామన్నారు. ఆయా ఆగమాలలో నిష్ణాతులైన పండితులే ఈ మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. రాత, మౌఖిక పరీక్షల్లో వచ్చిన మార్కులను క్రోడీకరించి తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తామని చెప్పారు.అభ్యర్థులు సమర్పించిన ఆప్షన్ల ఆధారంగా 'మెరిట్ కమ్ ఆప్షన్' పద్ధతిలో వివిధ ఆలయాలకు కేటాయింపులు జరుపుతామని రామచంద్ర మోహన్ వివరించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ అధికారులు, వివిధ ఆలయాలకు చెందిన సీనియర్ అర్చకులు పాల్గొన్నారు.

## శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి బ్యాటరీ వెహికల్ అందజేత



విజయవాడ, సెప్టెంబర్ 28 (నేటి శుభోదయ):-ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ అధికారులు భక్తులు సౌకర్యార్థం ఆధునిక బ్యాటరీ వెహికల్ ను సోమవారం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి అందజేశారు. దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ వాహనాన్ని ప్రారంభించారు.

## నగర పారిశుధ్యం, రహదారుల నిర్వహణ, పచ్చదనంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**ఈ నెల 30న అజిత్‌సింగ్ నగర్‌లో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, సెప్టెంబర్ 28 (నేటి శుభోదయ):-విజయవాడ నగరంలో పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, రహదారులపై గుంతలు లేకుండా తగిన మరమ్మతు చర్యలు చేపట్టాలని, డివైడర్లలో మొక్కలు ఎల్లప్పుడూ పచ్చదనంతో కళకళలాడేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు రహదారుల పరిశుభ్రత, సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఉదయం నగరంలో విస్తృతంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ పర్యటనలో మహాత్మాగాంధీ రోడ్, లబ్బీపేట, కాళేశ్వరరావు మార్కెట్, ఫ్లైఓవర్ ప్రాంతం, సీతమ్మవారి పాదాలు, ప్రకాశం బ్యారేజ్ పరిసరాలు, కాళేశ్వరరావు ఫ్లైఓవర్, తుమ్మలపల్లి కళాక్షేత్రం రోడ్డు, పాత ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రోడ్డు, ఏలూరు రోడ్, ప్రభుత్వ ప్రెస్ ప్రాంతం, అజిత్‌సింగ్ నగర్, డాబాకోట్ల సెంటర్, భగత్‌సింగ్ రోడ్ తదితర ప్రాంతాలను సందర్శించి పారిశుధ్య నిర్వహణ, రహదారుల పరిస్థితి, డివైడర్లలో పచ్చదనం, నగర సుందరీకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారులపైనా ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడైనా రహదారులపై గుంతలు ఏర్పడితే వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా రహదారులను సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉంచాలని సూచించారు. రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.అదేవిధంగా రహదారుల మధ్యనున్న డివైడర్లలో మొక్కలు ఎండిపోకుండా తగిన సంరక్షణ చర్యలు తీసుకోవాలని, మొక్కలు లేని ప్రాంతాలను గుర్తించి వెంటనే కొత్త మొక్కలు నాటాలని ఆదేశించారు. డివైడర్లు, ప్రధాన రహదారుల వెంట పచ్చదనం పెంపొందించడం ద్వారా నగరాన్ని మరింత ఆహ్లాదకరంగా, సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. చేపట్టిన అభివృద్ధి, సుందరీకరణ పనులు నిరంతరం నిర్వహణలో ఉండేలా సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీన అజిత్‌సింగ్ నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో నిర్వహించనున్న ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి విజయవాడ నగరపాలక సంస్థ తరఫున చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, రహదారుల సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలను సమకూర్చాలని, సంబంధిత అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా క్షేత్రస్థాయిలో ముందస్తు పరిశీలనలు నిర్వహించి, గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమ విజయవంతానికి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, జోనల్ కమిషనర్లు శ్రీనివాస్, కె. ప్రభుదాస్, చీఫ్ ఇంజినీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. నిర్మల గ్లోరీ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జై శ్రీనివాస్, గోపాలకృష్ణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి. అన్నపూర్ణ, ఆర్ఎఫ్ఓ సి.హెచ్. రత్నబాబు, ఎస్ఎఫ్ఓ నరేష్, ఏసీపీ మురళీ గౌడ్, డీసీపీ చంద్రబోస్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాల ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం

విజయవాడ, సెప్టెంబర్ 28 (నేటి శుభోదయ):- శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై వైభవంగా నిర్వహించనున్న శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు -- 2026 సమగ్ర ఏర్పాట్లపై దేవస్థానంలో సోమవారం ఉదయం ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు వర్ల రామయ్య, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు , రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి జి. ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్, డీసీపీ జి. రామకృష్ణ, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ , కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సన్నద్ధత, భక్తుల దర్శన ఏర్పాట్లు, రద్దీ నియంత్రణ, భద్రత, ట్రాఫిక్ మరియు పారిశుద్ధ్యంపై సమగ్రంగా సమీక్షించారు. వై. సత్యకుమార్ యాదవ్ (జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి) మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబర్ 11 నుండి 20 వరకు వైదిక కమిటీ సూచనల మేరకు శాస్త్రోక్తంగా నిర్వహించబడుతున్నాయని తెలిపారు.ఈ మహోత్సవాలలో శ్రీ అమ్మవారి దర్శనం కోసం వచ్చే సాధారణ భక్తులు, ఉత్సవాల అనంతరం భవానీ దీక్షల విరమణకు వచ్చే భవానీ భక్తులతో కలిపి దాదాపు 25 లక్షల మందికి పైగా తరలివచ్చే అవకాశముందని అధికారుల అంచనాను వివరించారు. ఘాట్‌రోడ్లు, పార్కింగ్ ప్రాంతాలు, దర్శన మార్గాలను సమన్వయం చేస్తూ పటిష్టమైన కార్యాచరణ రూపొందించామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులకు ఎండ, వర్షం తగలకుండా పూర్తిస్థాయిలో షెడ్లు, నిరంతర తాగునీటి సరఫరా, సేదతీరేందుకు కూర్చునే సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు క్యూలైన్లలో ఎంత సమయం పడుతుందో తెలియజేసేందుకు ఎల్ఈడీ / డిజిటల్ స్క్రీన్లను అమర్చుతున్నామని పేర్కొన్నారు. అధునాతన వసతులతో కూడిన నూతన ప్రసాదాల తయారీ, విశాలమైన అన్నదాన భవనాల ద్వారా భక్తులందరికీ నిరంతరం శుచికరమైన అన్నప్రసాదం అందించనున్నట్లు చెప్పారు. భక్తుల కోసం అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో దాదాపు 60 లక్షల లడ్డూ ప్రసాదాలనుసిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.

కేశినేని శివనాథ్ మాట్లాడుతూ

ఇంద్రకీలాద్రికి తరలివచ్చే ప్రతి సామాన్య భక్తుడూ ఎంతో సంతృప్తితో, సంతోషంగా అమ్మవారి దివ్య దర్శనం చేసుకుని వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్లాస్టిక్ రహిత విధానంలో, పర్యావరణహిత పద్ధతుల్లో 'బబుల్స్' ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నట్లు చెప్పారు. క్యూలైన్లలో చంటిపిల్లలతో వచ్చే తల్లుల కోసం ప్రత్యేకంగా వేడిపాలు, బిస్కెట్లు నిరంతరం పంపిణీ చేసేందుకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వర్ల రామయ్య మాట్లాడుతూ దసరా నవరాత్రులు భక్తులందరి పండుగని, ఇందులో ఎలాంటి వీఐపీ సంస్కృతి లేకుండా సామాన్య భక్తులకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.సామాన్యులు గంటల తరబడి నిరీక్షించకుండా త్వరితగతిన దర్శనం పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కె. రామచంద్ర మోహన్ మాట్లాడుతూ

ఉత్సవాల వేళ విధులతో సంబంధం లేకుండా వివిధ శాఖల సిబ్బంది కొండపైకి రావడం వల్ల కొన్ని సున్నితమైన ప్రదేశాలలో రద్దీ నియంత్రణ సవాలుగా మారుతోందని, ఈ సమస్యను దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, ఏఈవోలు సమన్వయంతో అధిగమించాలని ఆదేశించారు.

గతంలో మూలా నక్షత్రం (సరస్వతీ దేవి అలంకారం) రోజున రద్దీ విపరీతంగా పెరిగిపోయి వేలాది మంది భక్తులకు దర్శనం దొరకక నిరాశతో వెనుదిరిగిన సందర్భాలు ఉండేవని గుర్తుచేశారు. గత ఏడాది అటువంటి సమస్యలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టామని, ఈ సంవత్సరం మరింత మెరుగైన రీతిలో సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శనం కల్పిస్తామని




స్పష్టం చేశారు.సామాన్య భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎస్.వి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సరికొత్త ఏఐ కెమెరాలు, సిసిటీవి పర్యవేక్షణ, ప్రత్యేక నియంత్రణ కేంద్రం (కంట్రోల్ రూమ్) ద్వారా 24 గంటలూ కొండపై, పరిసర ప్రాంతాలలో నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా విస్తృతమైన ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేస్తున్నామని, నగర శివార్లలో మరియు ప్రధాన కూడళ్లలో పటిష్టమైన పార్కింగ్ కేంద్రాలను కేటాయించామని తెలిపారు. పార్కింగ్ ప్రదేశాల నుండి భక్తులను సురక్షితంగా తరలించేందుకు ఉచిత షటిల్ బస్సులను నిరంతరం నడుపుతామని వెల్లడించారు.

### శ్రీమతి ఇలక్కియ మాట్లాడుతూ

దసరా మహోత్సవాల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేస్తూ విధుల కేటాయింపులు పూర్తి చేసినట్లు తెలిపారు.భక్తుల ఆరోగ్య రక్షణ దృష్ట్యా ఘాట్‌రోడ్లు, క్యూలైన్లు మరియు కీలక ప్రాంతాలలో 24 గంటలు పనిచేసే వైద్య శిబిరాలు, ప్రథమ చికిత్స కేంద్రాలు, అత్యవసర సేవల కోసం అంబులెన్సులను సిద్ధంగా ఉంచామని వివరించారు.

మహోత్సవాల ప్రధాన విశేషాలు ఒ ఏర్పాట్లు:

**1. లిడిజిటల్ సేవలు ఒ ఆర్జిత పూజలు:**

నూతన పూజా మండపంలో ప్రత్యేకంగా ఖడ్గమాలార్చన, కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణార్చన, చండీహోమములు శాస్త్రోక్తంగా నిర్వహించబడతాయని, ఆర్జిత సేవల టికెట్లను దేవాదాయ శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా, 'మనమిత్ర' వాట్సాప్ నెంబర్ (9552300009) ద్వారా భక్తులు సులభంగా పొందవచ్చని, పరోక్ష సేవలను బుక్ చేసుకున్న భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాదాలను వారి చిరునామాకు తపాలా ద్వారా పంపేలా ఏర్పాట్లు చేశామని, 2. నగరోత్సవం ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు సాయంత్రం 04:00 గంటలకులి శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయం నుండి నగర పురవీధులలో అత్యంత వైభవంగా నగరోత్సవం నిర్వహించబడుతుందని, 3. పారిశుధ్య పర్యవేక్షణ: జీపీఎస్ ఆధారిత పారిశుధ్య పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశామని, అదనపు పారిశుధ్య సిబ్బందితో షిఫ్టుల వారీగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, డిజిటల్ కియోస్క్‌లు, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా భక్తుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తారని, అన్ని ప్రభుత్వ విభాగాలు, పోలీస్ యంత్రాంగం, మున్సిపల్ అధికారులు, దేవస్థానం సిబ్బంది సమన్వయంతో అంకితభావంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దసరా మహోత్సవాలు-2026ను అత్యంత వైభవంగా, దిగ్విజయంగా నిర్వహించాలని సమావేశంలో తీర్మానించడం జరిగింది.

## పోలింగ్ కేంద్రాల తుది జాబితా నేటి నుంచి అందుబాటులోకి

విజయవాడ, సెప్టెంబర్ 28 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో సాధారణ ఎన్నికలు--2026 నేపథ్యంలో డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలు, సూచనల స్వీకరణ గడువు 2026 ఈ నెల 27తో ముగిసిందని అధికారులు తెలిపారు. అభ్యంతరాలు, సూచనలను స్వీకరించిన అనంతరం రూపొందించిన పోలింగ్ కేంద్రాల తుది జాబితాను సోమవారం నుంచి విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాలు, కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు.

## సాధారణ ఎన్నికలు--2026: కులాల వారీ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ గడువు పూర్తి

విజయవాడ, సెప్టెంబర్ 28 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో సాధారణ ఎన్నికలు--2026 నేపథ్యంలో డివిజన్ల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల వివరాలతో రూపొందించిన డ్రాఫ్ట్ జాబితాలపై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసింది. ఈ ప్రక్రియలో భాగంగా 57వ డివిజన్‌కు సంబంధించి ఒక అభ్యంతరం అందింది. ఆ డివిజన్‌లో ఎస్సీ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, డ్రాఫ్ట్ జాబితాలో బీసీ ఓటర్ల సంఖ్య ఎక్కువగా చూపించారని మాజీ కార్పొరేటర్ హనుమంతరావు అభ్యంతరం తెలియజేశారు .అందిన అభ్యంతరాన్ని సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

## యువ క్రికెటర్లను ప్రోత్సహించడమే ఆర్డిటి ధ్యేయం

**- గ్రామీణ వర్గాలకు వృత్తి నైపుణ్య శిక్షణే లక్ష్యం**

**- మచ్చా రామలింగారెడ్డి, ఆర్‌డిటి క్రికెట్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్**



గుత్తి అనంతపురం జిల్లా, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ ::: యువ క్రికెటర్లను ప్రోత్సహించడమే లక్ష్యంగా వారిలో ఉన్నటువంటి నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే ఆర్డిటి మంచో ఫెర్రర్ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అందులో ప్రతి ఒక్కరూ యువ క్రికెటర్లు భాగస్వాములై ఉపయోగించుకోవాలని మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్ధమాన క్రికెట్ ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించి, మద్దతు ఇవ్వడం ద్వారా గ్రామీణ వర్గాలకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించడమే ఆర్‌డిటి లక్ష్యమని, ఇందుకోసం వనరుల వినియోగం, నిరంతర సాధన ఆవశ్యకతను నొక్కి చెబుతున్నామని ఆర్‌డిటి క్రికెట్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. గుత్తి పట్టణంలోని రైల్వే గ్రౌండ్ నందు ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ కార్యక్రమం సోమవారం ఉదయం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మచ్చా రామలింగారెడ్డి ప్రసంగిస్తూ ఆర్‌డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ గురించి వివరించారు. ఆటగాళ్ల అభివృద్ధికి నిరంతర సాధన చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రోత్సహించారు. తదుపరి దశల కోసం ఎంపికలు, మ్యాచ్‌లు, ఫిట్‌నెస్ శిక్షణ ద్వారా అభ్యర్థులను గుర్తిస్తామని ఆయన తెలిపారు. ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న తల్లిదండ్రులకు, పీఈటీఎస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియలో సెలెక్టర్లు వెంకటేష్ విజయరాజు రఫీ నరేంద్ర డి. ఆర్డీటీ కోఆర్డినేటర్ ప్రవీణ్ గుత్తి క్రికెట్ కోచ్ మహేష్, సీనియర్ క్రికెటర్లు మహిళా క్రికెటర్లు పాల్గొన్నారు. ఎంపిక కమిటీ వర్షం తగ్గే వరకు వేచి చూసినప్పటికీ, వాతావరణం ప్రక్రియకు అంతరాయం కలిగించి, పిచ్ పరిస్థితులను దెబ్బతీసింది. ఫలితంగా, ఎంపికలు వాయిదా పడ్డాయి. కొత్త తేదీని తగిన సమయంలో తెలియజేయడం జరుగుతుంది.



## ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

**86 కుక్కలకు, 62 మంది సిబ్బందికి వ్యాక్సినేషన్**




విజయవాడ, సెప్టెంబర్ 28 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం లాల్ బహదూర్ వీధి, సీతారాంపురంలో వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో కుక్కలకు టీకాలు వేశారు. ప్రజారోగ్య పరిరక్షణ, జంతువుల ద్వారా వ్యాపించే రేబిస్ వ్యాధి నివారణ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ హరీష్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28న ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తారని, రేబిస్ వ్యాక్సిన్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన లూయిస్ పాశ్చర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ దినోత్సవాన్ని పాటిస్తారని తెలిపారు. ఈ ఏడాది ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా 'వన్ హెల్త్' విధానానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మనుషులు, జంతువులు, పర్యావరణ ఆరోగ్యం పరస్పరం అనుసంధానమై ఉంటాయని, సమన్వయంతో కూడిన చర్యల ద్వారా రేబిస్ వ్యాధిని నివారించవచ్చని వివరించారు. ఇందులో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ నిర్వహించగా, మొత్తం 86 కుక్కలకు టీకాలు వేసినట్లు తెలిపారు. రేబిస్ వ్యాధి నివారణలో భాగంగా జంతువులకు సకాలంలో టీకాలు వేయించడం ఎంతో ముఖ్యమని, పెంపుడు జంతువుల యజమానులు బాధ్యతగా వ్యవహరిస్తూ వాటికి క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలని సూచించారు. అదేవిధంగా విజయవాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో వీధి కుక్కలకు సంబంధించిన విధుల్లో పనిచేస్తున్న సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల వైద్యులతో సమన్వయం చేసుకుని, నగరపాలక సంస్థలో పనిచేస్తున్న సంబంధిత సిబ్బందికి యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ అందించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మొత్తం 62 సిబ్బందికి టీకాలు వేసినట్లు వెల్లడించారు. జంతు ప్రేమికులకు కూడా రేబిస్ వ్యాధి నివారణ, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, వీధి కుక్కలు, పెంపుడు జంతువుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. ప్రజలు, జంతువుల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు, వ్యాక్సినేషన్ చర్యలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ హరీష్‌తో పాటు నగరపాలక సంస్థ సిబ్బంది, పారిశుధ్యకార్మికులు, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

## పేదల జీవితాల్లో వెలుగులు
## 30వ తేదీ పట్టాభిషేకానికి అందరూ హాజరు కావాలి

**7వ డివిజన్ లోని నివాసితులను స్వయంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, సెప్టెంబర్ 28 (నేటి శుభోదయ):- పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. సోమవారం ఉదయం తూర్పు లోని 7వ డివిజన్ చంద్ర రాజేశ్వరరరావు నగర్‌లో ఎమ్మెల్యే గద్దె పర్యటించారు. ఈ నెల 30వ తేది జరిగే పట్టాభిషేకం కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా అక్కడి నివాసితులను ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి మొదటి రోజు నుంచే పేదల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అందులో భాగంగానే ఇప్పుడు పేదలకు పూర్తిస్థాయి హక్కులతో పట్టాలను అందచేస్తున్నామని, ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్క హాజరు కావాలని గద్దె అక్కడివారిని కలిసి కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, పార్టీ నాయకులు పడమట సతీష్‌చంద్ర, పెనుకొండ శ్రీనివాస్, పడాల గంగాధర్, దయాల శిరీషా గాంధీ, కోటా లక్ష్మి, కర్రీ రాజేష్, పడాల వాసు తదితరులు పాల్గొన్నారు.

## 14వ డివిజన్‌లో రూ.80 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, సెప్టెంబర్ 28 (నేటి శుభోదయ):- ఈ నెల 30 బుధవారం నగరంలో పట్టాభిషేకం పేరుతో వేల కోట్ల రూపాయల విలువైన భూములకు చెందిన పట్టాలను పేదలకు ఉచితంగా అందచేస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. సోమవారం ఉదయం తూర్పులోని 14వ డివిజన్ చేపల మార్కెట్ దగ్గర రూ.80 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ నగరంలో ఈ నెల 30వ తేదిన పట్టాభిషేకం పేరుతో పేదలకు వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములలో నివాసం ఉంటున్న వారికి పూర్తి హక్కులతో పట్టాల పంపిణీ చేయనున్నామన్నారు. ప్రభుత్వ భూముల్లో పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ, వాటికి పట్టాలు లేకపోవడంతో బ్యాంకు రుణాలను పొందలేకపోతున్నారు. తమ పిల్లలకు ఈ ఆస్తిని వారి పేరుతో ఇవ్వడం సాధ్యం కావడంలేదన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రెవెన్యూ శాఖా మంత్రి సత్యప్రసాద్ కలిసి చర్చించుకుని ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారందరికి పట్టాలు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం దాదాపు రూ.25 వేల కోట్ల రూపాయల విలువైన భూములను పేదలకు పట్టాల రూపంలో అందిస్తోందన్నారు. ఒక్కో కుటుంబానికి 50 గజాల నుంచి వంద గజాల వరకు స్థలం ఉన్న ఇళ్ళకు పట్టాలు ఇవ్వనున్నామని, దీనివల్ల పేద కుటుంబాలకు జీవితాంతం ఉపయోగపడే స్థిరాస్తి వారి సొంతం అవుతుందన్నారు. ఈ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి ఈ నాలుగు పండగలు ఒకేసారి వచ్చినంత సంతోషంగా ప్రజలు నిర్వహించుకుంటారని అన్నారు. ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదిన పండుగ వాతావరణం నెలకుందన్నారు. తూర్పులో ఎంతో మంది పట్టాలు ఉన్నా రిజిస్ట్రేషన్ కాని వారికి పూర్తిస్థాయి హక్కులతో పట్టాలు ఇస్తున్నామన్నారు. సంజయ్‌గాంధీ కాలనీలో 45 మందికి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నామన్నారు. తూర్పు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పట్టాలు ఇచ్చేలా ఎమ్మెల్యే గద్దె కృషి చేశారన్నారు. చెన్నుపాటి గాంధీ మాట్లాడుతూ డివిజన్‌లో రూ.80 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులకు చేపట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. డ్రైనేజీ పనులు పూర్తి అయిన తర్వాత మిగిలిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. బిజెపి నాయకులు పోతంశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ దర్శిపేటలో శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.25 వేల కోట్ల విలువైన పట్టాలను ఈ నెల 30వ తేదిన అందచేస్తున్నారన్నారు. సమస్యను తెలియజేసిన వెంటనే ఎమ్మెల్యే గద్దె స్పందించి ఆ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తున్నారని అన్నారు. ఈ నెల 30వ తేదిన పట్టాల పండుగ జరిగే కార్యక్రమాన్ని అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ,పార్టీ నాయకులు కర్ణ రమేష్, గరికపాటి బద్రి, చెరుకూరు సాంబయ్య, చెన్నుపాటి వజీర్, కర్ణ కోటేశ్వరరావు, అన్నాబత్తుల బాబి, యడ్లపల్లి నాగరాజు, వీరంకి డాంగే కుమారి, గద్దె రమేష్, రేపాకుల ప్రసాద్, షేక్ ఫాతిమా, పాతరెడ్డి వెంకట్రావ్, కెల్లా రమేష్ నాయుడు, గల్లా రవి. ఈఈ రామారావు, ఏఈ భావన తదితరులు పాల్గొన్నారు.

## "మా ఫ్యూచర్.. మా లోకేష్ అన్న" అంటూ యువత నినాదం.

**సెంట్రల్‌లో యువ నాయకులు బొండా సిద్ధార్థ ఆధ్వర్యంలో యువత కదం తొక్కింది**



విజయవాడ, సెప్టెంబర్ 28 (నేటి శుభోదయ):- మాచవరం ప్రభుత్వ ఇంటర్ ఒ డిగ్రీ కళాశాల వద్ద నుండి దీూచీూ సిగ్నల్ వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఐటీ ఒ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు సెంట్రల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థ సుమారు 4,000 మంది ప్రభుత్వ కళాశాలల జెంజీ విద్యార్థులతో "యువత భవితకు భరోసా" భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బొండా సిద్దార్థ మాట్లాడుతూ రాష్ట్రంలోని యువత భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని, డీఎస్సీ మెగా నోటిఫికేషన్ ద్వారా 16,000 పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలకు అనుగుణంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు రంగంలోనూ భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు, ఐటీ రంగంలో ప్రముఖ సంస్థలను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా యువతకు వారి సొంత రాష్ట్రంలోనే మెరుగైన ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి మరిన్ని ప్రముఖ ఐటీ సంస్థలు, భారీ పెట్టుబడులను తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు పొందే అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారని, రాష్ట్రంలో ఐటీ రంగం విస్తరణతో యువతకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. అయితే యువతకు ఉద్యోగాలు, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుంటే వైసీపీ మాత్రం రాజకీయ విమర్శలు, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలకు పాల్పడుతోందని, విశాఖలో జరిగిన ఘటనలు, డీఎస్సీ నియామక ప్రక్రియపై చేస్తున్న ఆరోపణలు, బందర్ రోడ్డులో ప్రజలకు ఇబ్బందులు కలిగించిన ఘటనలు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. పారదర్శకంగా జరుగుతున్న డీఎస్సీ నియామక ప్రక్రియపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. నారా లోకేష్ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో వైసీపీ చేస్తున్న రాజకీయ ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, ఇలాంటి రాజకీయాలతో యువతను తప్పుదోవ పట్టించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో పార్టీ అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా ముందుకు సాగాలని పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సూచించారని, రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యా రంగం అభివృద్ధి, ఐటీ రంగంలో పెట్టుబడుల సాధనకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. యువతకు మెరుగైన భవిష్యత్తు, రాష్ట్రానికి పెట్టుబడులు, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎచీూఖీ జనరల్ సెక్రటరీ చరణ్ సాయి యాదవ్, సెంట్రల్ నియోజకవర్గ ఎచీూఖీ అధ్యక్షులు బంగారపు సతీష్, ఎచీూఖీ నాయకులు మణికంఠ, గాడి మురళి, ఆళ్ల శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ' పేదలకు పట్టాభిషేకం"ఇళ్ల పట్టాల లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి ఆహ్వానించిన ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, సెప్టెంబర్ 28 (నేటి శుభోదయ):- సోమవారం ఉదయం 63వ డివిజన్‌లో ఇళ్ల పట్టాలు మంజూరైన లబ్ధిదారుల ఇళ్లకు ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సోమవారం వెళ్లి వారిని ఆత్మీయంగా కలిశారు. లబ్ధిదారులకు బొట్టు పెట్టి, ఈ నెల 30వ తేదీ బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా " పేదలకు పట్టాభిషేకం" ద్వారా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ సొంతింటి కల ప్రతి పేద కుటుంబానికి నిజం కావాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇళ్ల పట్టాలు అందుకోనున్న లబ్ధిదారులు కుటుంబ సభ్యులతో కలిసి 30వ తేదీన జరిగే కార్యక్రమానికి తప్పక హాజరై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పట్టాలు స్వీకరించాలని కోరారు. ఇళ్ల పట్టాలు మంజూరు కావడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. తమకు సొంతింటి కల సాకారం అవుతున్నందుకు ఎమ్మెల్యే ఉమా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 63వ డివిజన్ పార్టీ అధ్యక్షులు లబ్బా వైకుంఠం , డివిజన్ ఇన్‌చార్జి మోతుకూర్ ఖాసీం , సెక్రటరీ కోలా శ్రీనివాసరావు , మహిళా నాయకురాలు లబ్బా దుర్గ , ూని మెహర్ అంజి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నున్న సీఐ అలీ ఆకస్మిక మృతి పోలీసు శాఖకు తీరని లోటు, సీఐ కుటుంబానికి అండగా ఉంటాం: ఎమ్మెల్యే బొండా ఉమా




విజయవాడ, సెప్టెంబర్ 28 (నేటి శుభోదయ):- సోమవారం ఉదయం పాయకాపురం నున్న పోలీస్ స్టేషన్ లో ధర్నా చౌక్ లో ఆదివారం విధులు నిర్వహిస్తూ ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందిన సీఐ అలీ మృతి పట్ల ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన పోలీసు అధికారిని కోల్పోవడం పోలీసు శాఖతో పాటు సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు కూడా తీరని లోటని, శాంతిభద్రతల పరిరక్షణలో, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించడంలో సీఐ అలీ ఎంతో కష్టపడి పనిచేశారని, విధి నిర్వహణలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు, పోలీసు శాఖకు సేవలందించారని గుర్తు చేశారు. సెంట్రల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించిన సమయంలో ప్రజలతో మమేకమై, శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేశారని, అలాంటి పోలీసు అధికారిని అకాలంగా కోల్పోవడం ఎంతో బాధాకరమని తెలిపారు. సీఐ అలీ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున అవసరమైన సహాయం అందేలా ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కుటుంబానికి అండగా నిలిచి, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సీఐ అలీ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఎమ్మెల్యే ఉమా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నున్న పోలీస్ సిబ్బందితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు నవనీతం సాంబశివరావు, పైడి తులసి, లబ్బా వైకుంఠం, కోలా శ్రీను, మోతుక్కూరి కాసిం, పైడి శ్రీను, బుదాల సురేష్, జలకం రాజ, దాసరి కనకరావు, ూని గౌసియా, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## పుట్టపర్తిని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుదాం
## స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం.

**కూటమి అధికారంలోకి వస్తేనే బిల్డర్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం**

**ఎమ్మెల్యే పల్లె సింధూర ప్రత్యేక కృషితో పుట్టపర్తి మున్సిపాలిటీలో రూ.182 కోట్లతో పలు అభివృద్ధి పనులు.. పుట్టపర్తి బిల్డర్లు తో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 28 నేటి శుభోదయ: పుట్టపర్తి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బిల్డర్లతో పుట్టపర్తి సాయి ఆరామంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో బిల్డర్లు, రియల్ ఎస్టేట్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. బిల్డర్లకు ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక కృషితో పుట్టపర్తి మున్సిపాలిటీలో సుమారు రూ.182 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులతో పాటు పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. పుట్టపర్తిని అంతర్జాతీయ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయడంతో పాటు పట్టణంలో ఆధునిక మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం బిల్డర్లు, వ్యాపారవేత్తలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తే పట్టణ అభివృద్ధికి మరింత వేగం వస్తుందని, బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయంతో ముందుకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందని డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి అభివృద్ధిలో బిల్డర్లు కూడా భాగస్వాములు కావాలని, నిబంధనలను పాటిస్తూ నాణ్యమైన నిర్మాణాలు చేపట్టి పట్టణ ప్రగతికి సహకరించాలని ఆయన కోరారు.

## జగ్గంపేట మెయిన్ సెంటర్‌లో మురుగునీరు...

**దుర్గంధంతో ప్రజల అవస్థలు...అధికారులకు, పాలకులకు కళ్ళు కనిపించడం లేదా**

**నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ఇదే ప్రదేశంలో కూర్చుంటా**

**పాటంశెట్టి సూర్యచంద్ర ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి**




కాకినాడ జిల్లా, జగ్గంపేట సెప్టెంబర్ 28 నేటి శుభోదయ: జగ్గంపేట పట్టణంలోని ప్రధాన కూడలిలో మురుగునీరు రోడ్డుపై నిలిచిపోయి దుర్గంధభరితంగా మారినా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర మండిపడ్డారు. జగ్గంపేటకు నిత్యం వేలాది మంది ప్రజలు వచ్చిపోయే మెయిన్ సెంటర్‌లోనే మురుగునీరు రోడ్డుపై నిలిచిపోయి, దుర్వాసన వెదజల్లుతున్న పరిస్థితి నెలకొంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రజలు, వ్యాపారులు నిత్యం ఇబ్బందులు పడుతుంటే అధికారులు, పాలకులకు ఈ సమస్య కనిపించడం లేదా ప్రజల ఆరోగ్యం పట్ల ఇంత నిర్లక్ష్యమా అని సూర్యచంద్ర నిలదీశారు. వీడియోలో కనిపిస్తున్న పరిస్థితిని చూస్తే జగ్గంపేట ప్రధాన కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని అన్నారు. మురుగునీరు నిలిచిపోవడానికి కారణమైన డ్రైనేజీ సమస్యను గుర్తించి నీటిని తొలగించడమే కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల గడువు "జగ్గంపేట మెయిన్ సెంటర్‌లో ప్రజలు ఇంత ఇబ్బంది పడుతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నాలుగు రోజుల్లో ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించాలి. నాలుగు రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే ఇదే ప్రదేశంలో కూర్చుని ప్రజల తరపున నిరసన చేపడతాను

## రేడియేటర్ షాపులో షార్ట్ సర్క్యూట్ భారీ నష్టం



గుడివాడ, సెప్టెంబర్ 28 నేటి శుభోదయ: రేడియేటర్ షాపులో షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. సోమవారం సాయంత్రం బస్టాండ్ ఎదురు రోడ్డులోని కాంప్లెక్స్ వెనుకవైపు ఉన్న మూడు రేడియేటర్ షాపులలో ఒక షాపులో షార్ట్ సర్క్యూట్ కారణంగా సుమారు 50 రేడియేటర్లు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాద వార్తా అందిన వెంటనే వెంటనే గుడివాడ అగ్నిమాపక అధికారి జే. ఆంజనేయులు ఆధ్వర్యంలో గుడివాడ అగ్నిమాపక సిబ్బంది రెండు అగ్నిమాపక వాహనాలతో తరలి వెళ్లి మంటలను ని చుట్టుపక్కల ఉన్నటువంటి కమర్షియల్ షాపులకు అంటుకోకుండా భారీ ఆస్తి నష్టం జరగకుండా నివారించారు.

## అగ్ని ప్రమాదాల నివారణలో అప్రమత్తతే ప్రాణ రక్షణకు తొలి అడుగు"




నందివాడ, సెప్టెంబర్ 28 నేటి శుభోదయ: మండల పరిధిలో నందివాడ గ్రామంలోని మూడు పాఠశాలల్లో గుడివాడ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన డెమోలు, అగ్ని ప్రమాదాలపై విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు అత్యవసర సమయాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించేలా శిక్షణ ఇవ్వడానికి గుడివాడ అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నందివాడ మండలం తమిరిశలోని మూడు పాఠశాలల్లో సోమవారం అగ్ని భద్రత అవగాహన కార్యక్రమాలు, ప్రత్యక్ష డెమోలు నిర్వహించారు. తమిరిశలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, గ్యాస్ సిలిండర్ లీకేజీ, వంటగదిలో మంటలు, విద్యుత్ పరికరాల వినియోగంలో జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు భయాందోళనలకు గురికాకుండా




ప్రశాంతంగా వ్యవహరించడం, అత్యవసర మార్గాల ద్వారా సురక్షితంగా బయటకు రావడం, ఇతరులను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలను వివరించారు. అనంతరం ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. వివిధ రకాల మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక పరికరాలను సరైన విధంగా ఎలా ఉపయోగించాలో సిబ్బంది విద్యార్థులకు ప్రాక్టికల్‌గా చూపించారు. అగ్ని ప్రమాద సమయంలో పొగ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నేలకు దగ్గరగా వంగి కదలడం, లిఫ్ట్‌లను ఉపయోగించకుండా మెట్ల ద్వారా బయటకు రావడం, అత్యవసర సమయంలో ఒకరినొకరు తోసుకోకుండా క్రమశిక్షణతో బయటకు రావడం వంటి ముఖ్యమైన భద్రతా సూచనలు అందించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా డెమోలను వీక్షించి, అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సందేహాలను అగ్నిమాపక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు. "అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమ రక్షణ" అని అగ్నిమాపక సిబ్బంది సూచించారు. విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే అగ్ని భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో ప్రమాదాల సమయంలో ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఫైర్ స్టేషన్ సిబ్బంది నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం తమిరిశలో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో అగ్ని భద్రతపై చైతన్యం కల్పించిందన్నారు.

## గుడివాడ 14వ వార్డు టీడీపీ కార్యకర్త దంపతుల మృతి

**...అనాథలైన ఇద్దరు చిన్నారులకు టీడీపీ అండ**

**-చిన్నారుల భవిష్యత్తుకు భరోసాగా రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందించిన టీడీపీ...ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను చిన్నారులకు అందజేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము. కష్టకాలంలో పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న... కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుంది**



గుడివాడ, సెప్టెంబర్ 28 నేటి శుభోదయ: గుడివాడ 14వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త దాసరి దేవా, ఆయన భార్య అనారోగ్య సమస్యలతో మృతి చెందడంతో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారులకు టీడీపీ పార్టీ అండగా నిలిచింది. చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా పార్టీ తరఫున రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది. మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు చిన్నారుల పేర్లపై చెరో రూ.2 లక్షల చొప్పున చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను సోమవారం గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వర్ రావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తో కలిసి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.. దాసరి దేవా దంపతుల మృతి బాధాకరమని, తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు పార్టీ అండగా నిలవడం తమ బాధ్యతగా భావించామని తెలిపారు. కార్యకర్తలు కష్టకాలంలో పార్టీకి అండగా నిలుస్తున్నట్లే, వారి కుటుంబాలకు ఆపద సమయంలో పార్టీ అండగా ఉంటుందన్నారు. టీడీపీ సభ్యత్వం కలిగిన కార్యకర్తలు మృతి చెందితే వారికి రూ.5 లక్షల వరకు సభ్యత్వ బీమా సదుపాయం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. అయితే దేవా మృతి ఇతర కారణాల వల్ల జరగడంతో బీమా సదుపాయం వర్తించకపోవడాన్ని పార్టీ నాయకత్వం గుర్తించిందన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి లోకేష్ దృష్టికి విషయం తీసుకెళ్లగా, చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూ.4 లక్షల సహాయం అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. చిన్నారుల చదువు, భవిష్యత్తుకు ఈ మొత్తం ఉపయోగపడేలా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు రాము తెలిపారు. కార్యకర్త కుటుంబానికి కష్ట సమయంలో అండగా నిలవడం కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వారికి పార్టీ తోడుగా ఉందనే భరోసా కల్పించడమే ముఖ్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాము చొరవతో రూ.4 లక్షల సహాయం అందడంపై చిన్నారుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, రామిదేని వేణుబాబు, 14వ వార్డు టిడిపి అధ్యక్షుడు ముల్లపూడి రమేష్ చౌదరి, వార్డ్ టిడిపి నాయకులు మానూరి శ్రీను, ఉప్పటాల జమలయ్య, లంకలపల్లి దుర్గారావు, దాసరి సత్యనారాయణ, దాసరి జాన్, గనుగుల భరత్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం...

**జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**



అనంతపురం బ్యూరో సెప్టెంబర్28 నేటి శుభోదయ : ప్రజా సమస్యలను వేగంగా, పారదర్శకంగా, నిబంధనల మేరకు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని రెవెన్యూ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ఎస్ )రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలకు సంబంధించిన అర్జీలను ప్రజల నుండి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక మరియు రెవెన్యూ క్లినిక్ లో వచ్చినఅర్జీలనుఎప్పటికప్పుడు పరిష్కరించాలని అర్జీలను నాణ్యతగా పరిష్కరించడం పై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు సమర్పించిన ప్రతి ఫిర్యాదు అర్జీని పరిశీలించి సమస్యల పరిష్కారానికి సంబంధితశాఖలఅధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారం పై నిత్యం పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని డివిజన్ స్థాయి అధికారులు కూడా అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే వాటి పరిష్కారానికి కృషి చేయాలని ,ఇందులో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలప్రకారంగడువులోగా సమస్యలను పరిష్క రించాలని సూచించారు. అలాగే భూసమస్యల పై ప్రత్యేకదృష్టిని సారించాలని, రీసర్వేపూర్తయినగ్రామాల్లో సరిహద్దువివాదాలు రికార్డులో నితప్పులు, విస్తీర్ణవత్యాసాలు తదితర అంశాలపైవచ్చేఫిర్యాదులనుప్రాధాన్యతతో పరిష్కరించాలని, భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తేచర్యలు తప్పవని జాగ్రత్తగా హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ1100 టోల్ ఫ్రీ సేవ ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత బాధ్యతతో పరిష్క రించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతి అర్జీదారులతో నేరుగా మాట్లాడిన తర్వాతే నివేదిక సమర్పించాలని మాట్లాడిన తేదీ సమయాన్ని తప్పని సరిగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారు లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలోమండలస్థాయి అధికారులు ఖ చ్చితం గాప్రజాసమస్యల పరిష్కార వేదికకార్యక్రమంలో హాజరుకావాలని పెండింగ్ లో ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ప్రజల్లో 1100 సేవలపై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. నేటి రోజున సోమవారం జరిగిన పీజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుండి వివిధ సమస్యలతో కూడిన 497అర్జీలు వచ్చాయి. ఇందులో 255 రెవెన్యూ క్లినిక్ సంబంధించినవి కాగా ఇతర అర్జీలు 252 దాకా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ ,రెవెన్యూ అధికారి ఏ. మాలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లి కార్జున రెడ్డి , ఆనంద్, వెంకటనారాయణ ఆయా శాఖల అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలి

**యాడికి మండలంలో చేనేత కార్మికుల డిమాండ్**



యాడికి సెప్టెంబర్ 28 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : అనంతపురం జిల్లా యాడికి మండలంలో చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలని కోరుతూ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. నేతన్న సేవ పథకంలో క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల వెరిఫికేషన్‌ను పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికీ ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. ఈ మేరకు చేనేత జౌళిశాఖ అధికారులు, ఏడీవో, సచివాలయ సిబ్బంది మరియు వెల్ఫేర్ అసిస్టెంట్లకు వినతిపత్రం అందజేస్తూ వివరాల పరిశీలనలో నిర్లక్ష్యం వీడాలని విజ్ఞప్తి చేశారు. ఏ ఒక్క అర్హత కలిగిన లబ్ధిదారుడు కూడా ప్రభుత్వ సాయానికి దూరం కాకూడదని, అందరికీ సాయం అందించి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చింతా చౌదయ్య, బీజేపీ మండల నాయకులు గంగాధర్, మహేంద్ర, అంజి, నల్లప్ప, రామాంజి, రమణ, సురేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మాచర్లలో తుది పోలింగ్ స్టేషన్ల జాబితా నేడు ప్రచురణ

**ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించాలి**



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 28;నేటి శుభోదయ: మాచర్ల పురపాలక సంఘ పరిధిలోని పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన తుది జాబితాను సెప్టెంబరు 28న ప్రచురించనున్నట్లు పురపాలక సంఘం అధికారులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం విజయవాడ వారు జారీ చేసిన సూచనలు, ఆదేశాల మేరకు ఇప్పటికే పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను ప్రజల పరిశీలనార్థం ప్రకటించినట్లు తెలిపారు. ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాను రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, మాచర్ల పురపాలక సంఘం కమిషనర్ కార్యాలయం తదితర నిర్దిష్ట ప్రదేశాల్లో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించేందుకు సెప్టెంబరు 26 వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా వచ్చిన అభ్యంతరాలు, సూచనలను పరిశీలించిన అనంతరం తుది పోలింగ్ స్టేషన్ల జాబితాను అనుబంధం--ఎ, ఎ×, ఎ××లో భాగంగా సెప్టెంబరు 28న ప్రచురించనున్నట్లు మాచర్ల పురపాలక సంఘం అధికారులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు తుది పోలింగ్ స్టేషన్ల జాబితాను పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. తమ ఓటు వేసే పోలింగ్ కేంద్రానికి సంబంధించిన వివరాలను ముందుగానే తెలుసుకోవాలని కోరారు.

## దక్షిణేశ్వర్ కాళీమాత ఆలయం బేలూరు మఠాన్ని సందర్శించిన ఎంపీ పురంధేశ్వరి..!!



రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ జిల్లా ప్రతినిధి (ఏ.కె);కోల్‌కతాలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దక్షిణేశ్వర్ కాళీమాత ఆలయాన్ని సోమవారం బీజేపీ రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. శ్రీ రామకృష్ణ పరమహంసులు కాళీమాతను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక సాధన చేసిన పవిత్ర క్షేత్రంగా దక్షిణేశ్వర్‌కు విశిష్ట స్థానం ఉందని ఆమె పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక ప్రశాంతతను అనుభవించినట్లు తెలిపారు. అనంతరం హౌరాలోని బేలూరు మఠాన్ని ఆమె సందర్శించారు. స్వామి వివేకానందుల స్ఫూర్తితో రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ ఆధ్యాత్మికతతో పాటు మానవ సేవను కొనసాగిస్తున్న తీరు స్ఫూర్తిదాయకమని పురంధేశ్వరి పేర్కొన్నారు. బేలూరు మఠం ప్రశాంత వాతావరణం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని తెలిపారు. కాగా ఆయా ఆలయ అధికారులు, నిర్వాహకులు ఆధ్యాత్మికవేత్తలు పురందరేసరికి ఆలయ లాంఛనాలతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.



## పార్టీ బలోపేతమే లక్ష్యంగా సైనికుల్లా పనిచేద్దాం

**పార్టీ బలోపేతమే లక్ష్యంగా సైనికుల్లా పనిచేద్దాం**

**పాణ్యం బీసీ సెల్ అధ్యక్షుడు భవాని పిలుపు**

**కార్యకర్తల కష్టానికి గుర్తింపు ఇచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకత్వానికి కృతజ్ఞతలు**

**గ్రామ స్థాయి బాధ్యులకు నియామక కార్డుల పంపిణీ**




కర్నూలు సెప్టెంబర్ 28: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు పునరంకితం కావాలని, పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు లభిస్తుందని నూతనంగా నియమితులైన పాణ్యం బీసీ సెల్ అధ్యక్షుడు భవాని అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి వివిధ హోదాలకు సంబంధించిన గుర్తింపు కార్డులు మంజూరైన నేపథ్యంలో స్థానికంగా నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా నియమితులైన బాధ్యులకు నియామక కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ.. పాణ్యం నియోజకవర్గ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆశీస్సులతోనే కార్యకర్తలకు వివిధ బాధ్యతలు దక్కాయని తెలిపారు. ఇన్నాళ్లుగా పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన కార్యకర్తల సేవలను గుర్తించి వైఎస్సార్‌సీపీ నాయకత్వం బాధ్యతలు అప్పగించడం అభినందనీయమన్నారు. కష్టకాలంలోనూ పార్టీ జెండాను మోస్తూ ముందుకు సాగిన కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. తాను మొదటి నుంచి పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్నానని, తన సేవలను గుర్తించి పాణ్యం బీసీ సెల్ అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు అప్పగించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఎలాంటి ఒడిదుడుకులు ఎదురైనా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా నిలిచి పార్టీ బలోపేతానికి సైనికుల్లా అహర్నిశలు పనిచేయాలని భవాని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్థాయి బాధ్యులు, కార్యకర్తలు, భవాని అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు పొందిన వారికి అభినందనలు తెలిపారు.

## గోరుకల్లు రిజర్వాయర్ సమస్యలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పూర్తి నష్టపరిహారం ఇవ్వాలి:**

**కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఇసాక్ బాషా**



నంద్యాల, సెప్టెంబర్ 28 : నంద్యాల జిల్లా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జాయింట్ కలెక్టర్, జిల్లా ఎస్పీలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. గోరుకల్లు రిజర్వాయర్‌కు సంబంధించిన సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేసి, బాధిత ప్రజలు, రైతులకు తక్షణ ఉపశమనం కల్పించాలని కోరారు. రిజర్వాయర్ గేట్ల నిర్వహణలో లోపాలు, అకస్మాత్తుగా నీటి విడుదల జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన బాధ్యులను గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు పూర్తి నష్టపరిహారం: వరదలు, నీటి విడుదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులందరినీ సమగ్రంగా గుర్తించి, ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మౌలిక వసతుల పునరుద్ధరణ: నీటి ప్రవాహం, వరదల కారణంగా దెబ్బతిన్న గ్రామీణ రోడ్లు, ఇతర మౌలిక వసతుల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టి, ప్రజలకు రవాణా సౌకర్యాన్ని త్వరితగతిన పునరుద్ధరించాలని కోరారు. గోరుకల్లు రిజర్వాయర్ సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి, బాధిత రైతులు, గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఇసాక్ బాషా కోరారు.




## కర్నూలులో ఘనంగా స్కెచర్స్ స్టోర్ ప్రారంభం

**స్పోర్ట్స్, వాకింగ్, రన్నింగ్ షూస్‌కు ప్రత్యేక వసతి**




కర్నూలు సెప్టెంబర్ 28:కర్నూలు నగరంలోని ఆర్ఎస్ సర్కిల్‌లో ప్రముఖ అంతర్జాతీయ ఫుట్‌వేర్ బ్రాండ్ స్కెచర్స్ స్టోర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ యజమానులు అరుణాచలం, బుద్ధిష్, శృతి, ప్రవీణ్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో స్కెచర్స్‌కు ఇదే మొట్టమొదటి స్టోర్ అని తెలిపారు. స్టోర్‌లో పురుషులు, మహిళలకు సంబంధించిన వివిధ రకాల షూస్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా స్పోర్ట్స్, వాకింగ్, రన్నింగ్ షూస్‌తో పాటు బాస్కెట్‌బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ తదితర క్రీడలకు అవసరమైన ప్రత్యేక షూస్ కూడా లభిస్తాయని తెలిపారు. రూ.699 నుంచి రూ.15 వేల వరకు వివిధ ధరల శ్రేణిలో షూస్ అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, తిరుపతి, రాజమండ్రి, కాకినాడ, గుంటూరు తదితర నగరాల్లో ఇప్పటికే స్కెచర్స్ షోరూమ్‌లు ఉన్నాయని తెలిపారు. కర్నూలు నగర ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫుట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్టోర్ నిర్వాహకులు కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బంధుమిత్రులు, కస్టమర్లు, నగర ప్రజలు పాల్గొన్నారు.

